
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
గురువారం 18 సెప్టెంబరు 2025





అమ్మో.. బార్లు..

- రీ నోటిఫికేషన్‌కూ స్పందన అరకొరే
- గుంటూరులో 26, పల్నాడులో 8, బాపట్లలో 6 బార్లకు నేడు లాటరీ
- మిగిలిన బార్ల విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ

112 బార్లలో 72 బార్లకు దరఖాస్తులు నిల్

ఒకప్పుడు మద్యం బార్ల లైసెన్సుల కోసం వ్యాపారులు పోటీపడేవారు. ఎంతమొత్తం అయినా చెల్లించేందుకు కూడా సిద్ధమయ్యేవారు. అయితే నూతన మద్యం పాలసీ ప్రకారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో బార్ల లైసెన్సుల కోసం వ్యాపారులు ముందుకు రావడంలేదు. ఇప్పటికి రెండు సార్లు నోటిఫికేషన్ ఇవ్వగా వ్యాపారుల నుంచి స్పందన రాలేదు. దీంతో ఎలాగైనా బార్లకు వ్యాపారుల నుంచి దరఖాస్తులు చేయించాలని ఎక్సైజ్ విభాగం రెండు సార్లు గడువు కూడా పెంచింది. అయినా బార్లు తీసుకునేందుకు వ్యాపారులు వెనుకంజ వేస్తున్నారు. తొలి విడత నోటిఫికేషన్ లాటరీ ప్రక్రియ అనంతరం మిగిలిన(గుంటూరు జిల్లాలో 67, పల్నాడు జిల్లాలో 30, బాపట్ల జిల్లాలో 15) బార్లకు ఈ నెల 3న ఎక్సైజ్ శాఖ రీ నోటిఫికేషన్ ఇచ్చింది. మూడు జిల్లాల పరిధిలో 112 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేసి ఒకసారి గడువు పెంచినా కేవలం 72 బార్లకు నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. అంటే మూడు జిల్లాల పరిధిలో 40 బార్లకు ఎవరూ ముందుకు రాలేదు.

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏం చేస్తారో తెలియదు.. ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లా పరిధిలోని అన్ని బార్ల ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తులు రావాల్సిందేనని ఈ నెల 3న బార్ల రీ నోటిఫికేషన్ జారీ సమయంలో ఎక్సైజ్ యంత్రాంగానికి ఉన్నతాధికారుల నుంచి అందిన అనధికారిక ఆదేశాలు. తొలివిడత నోటిఫికేషన్‌లో ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో ఉన్నతాధికారులు బాపట్ల జిల్లా యంత్రాంగంపై కన్నెర్ర చేసిన సంగతి తెలిసిందే. మొత్తం బార్లకు దరఖాస్తులు రావాల్సిందేనని లేకపోతే సిబ్బంది వైఫల్యంగా పరిగణించి చర్యలకు సైతం వెనకాడబోమనే అనధికారిక ఆదేశాలను ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు రీ నోటిఫికేషన్ జారీ సమయంలో పంపినట్లు జోరుగా ప్రచారం జరిగింది. ఈ పరిస్థితుల్లో వ్యాపారులతో ఎలాగైనా దరఖాస్తులు చేయించేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేశారు. ఎక్కడికక్కడ వ్యాపారులతో సమావేశాలు నిర్వహించారు. లైసెన్స్ పొందిన వారి ద్వారా కూడా దరఖాస్తులు చేయించేందుకు ప్రయత్నించారు. చివరకు రాజకీయ నేతలతో వ్యాపారులపై ఒత్తిడి కూడా చేశారు. అప్పటి నుంచి ఎక్సైజ్ శాఖ అధికారులు దరఖాస్తులు వేయించడానికి చేయని ప్రయత్నం లేదు. మలి నోటిఫికేషన్ ఈ నెల 3న జారీ చేయగా తొలుత ఇచ్చిన గడువు 14 కాగా దానిని 17 వరకు పొడిగిస్తూ ఎక్సైజ్‌శాఖ నిర్ణయం తీసుకోగా బుధవారంతో ఆ గడువూ ముగిసింది. అయినా రీ నోటిఫికేషన్ ద్వారా కూడా మొత్తం బార్లకు వ్యాపారుల నుంచి దరఖాస్తులు రాలేదు.

బాపట్ల జిల్లాలో మొత్తం 19 బార్లకు తొలి నోటిఫికేషన్‌లో 4 బార్ల ఏర్పాటు ప్రక్రియను ఎక్సైజ్ విభాగం ముగించింది. మిగిలిన 15 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేయగా బుధవారం సాయంత్రం గడువు ముగిసేప్పటికి ఆరు బార్లకు 24 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.నిబంధనల ప్రకారం

(మిగతా 6వ పేజీలో)

అసైన్డ్ కాదు.. పట్టానే..

రాజధాని అసైన్డ్ రైతులకు ఊరట



- రిటర్నబుల్ ప్లాట్లలో పట్టా భూమి అని మార్పు
- ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనపై రైతుల్లో హర్షం
- అసైన్డ్ పదాన్ని అడ్డుపెట్టుకుని రైతులను దోచిన దళారులు
- ఒక్కోరైతు గజానికి రూ.10 నుంచి 20 వేలు నష్టపోయిన వైనం

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన అసైన్డ్ రైతులకు మరో ఊరట లభించింది. అసైన్డ్ పేరుతో రియల్ ఎస్టేట్ దళారుల దోపిడీకి గురైన రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో ఊపిరి పీల్చుకున్నారు. రాజధాని కోసం 3,139 మంది అసైన్డ్ రైతులు 2,689.14 ఎకరాల భూములు ఇచ్చారు. దీంతో వీరికి సీఆర్డీఏ ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల పట్టాలు సమస్యాత్మకంగా తయారయ్యాయి. రైతులకు ఇచ్చిన పట్టాల్లో వారు ప్రభుత్వానికి ఇచ్చిన భూమి స్వభావాన్ని తెలియజేస్తూ 'అసైన్డ్' అనే పదాన్ని చేర్చారు. దీన్ని ఆసరా చేసుకుని దళారులు రైతులను ఇష్టారాజ్యంగా దోచుకుతిన్నారు. ఈ పదాన్ని అడ్డుపెట్టుకుని ఆ భూములకు అన్ని హక్కులు సంక్రమించవని చెప్పి రైతులను బెదరగొట్టి కారు చౌకగా కాజేశారు. ఒక్కో గజానికి రూ.10 నుంచి 20 వేలు తగ్గించి కొనుగోలు చేశారు. కొన్ని చోట్ల ఈ నష్టం 30 వేల వరకూ వెళ్లింది. రిటర్నబుల్ ప్లాట్లకు సంబంధించి సీఆర్డీఏ ఇచ్చిన పట్టాలలో అసైన్డ్ అనే పదం ఉండగా, దాన్ని తొలగించాలని రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు రెండు నెలల క్రితం మొరపెట్టుకున్నారు. దీంతో వారి సమస్యను పరిష్కరిస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి సురేశ్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది.

ఇలా సవరణ..

తాజాగా ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం రైతులకు జారీ చేసిన పట్టాల్లో భూ సమీకరణ చట్టంలో 9.24లోని కాలం నెంబరు 7, రూల్ నెంబరు 11(4) క్లాజ్‌ను మార్చాలని సూచించింది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రిటర్నబుల్ ప్లాట్ల పట్టాదారులకు యాజమాన్య హక్కు కల్పిస్తూ పట్టాలు జారీ చేయాలని సూచించింది.

గతంలో 'నాట్ ట్యాలీడ్' నుంచి విముక్తి

రాజధాని కోసం అసైన్డ్ రైతులు ఇచ్చిన భూములపై గత వైసీపీ సీఐడీ విచారణ తంతు నడిపించి, ఆ భూములను 'నాట్ ట్యాలీడ్' జాబితాలో పెట్టింది. ఆ కారణంగా 3,139 మంది రైతులు కష్టాలపాలయ్యారు. గత ప్రభుత్వం చివరి మూడేళ్ల వారికి కౌలు కూడా అందకుండా చేసింది. దీంతో రాజధాని పరిధిలోని అసైన్డ్ రైతులు నరకం చూశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఆ సమస్యపై దృష్టి సారించి సీఐడీ కేసుల నుంచి విముక్తి కల్పించి, కౌలు బకాయిలు మొత్తంగా చెల్లించింది.

మహిళల ఆరోగ్యంతోనే సమాజ ఆరోగ్యం

స్వస్త్ నారీ అభియాన్ ప్రారంభోత్సవంలో డాక్టర్ పెమ్మసాని



స్టాల్స్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళా ఆరోగ్యమే సమాజ ఆరోగ్యంగా భావించి స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌కు రూపకల్పన చేసినట్లు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో జిల్లాలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన మహిళ.. శక్తివంతమైన, ఆరోగ్యవంతమైన కుటుంబానికి నిలయంగా ఉంటుందన్నారు. అక్టోబరు 2 వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రుల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తాయని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద జిల్లాలో ఇప్పటి వరకు 8.60 లక్షల మంది నమోదయ్యారన్నారు. తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్‌అహ్మద్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. కలెక్టర్ తమీమ్‌అన్సారియా మాట్లాడుతూ స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో నిర్వహించే వైద్య శిబిరాలలో మహిళలు, బాలికలకు రక్తహీనత, క్షయ, సికిల్‌సెల్ అనీమియా గుర్తింపు పరీక్షలు, బీపీ, మధుమేహం, క్యాన్సర్ వంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, సూపరింటెండెంట్ డాక్టర్ రమణయశస్వి, కార్పొరేటర్ పోతురాజు సమత, పారిశ్రామికవేత్త రామచంద్రప్రభు పాల్గొన్నారు.

నేడు గుంటూరులో రిపోర్ట్ చేయాలి

- డీఎస్సీ అభ్యర్థులకు డీఈవో రేణుక సూచన

గుంటూరు విద్య, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మెగా డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు గురువారం గుంటూరు పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాలలో మధ్యాహ్నం రెండు గంటలకు రిపోర్టు చేయాలని డీఈవో రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న రాజధాని అమరావతిలో జరిగే నియామకపత్రాల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి డీఎస్సీ అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులలో ఒకరికి గుర్తింపు కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 19వ తేదీ ఉదయం ఏడు గంటలకల్లా అభ్యర్థులు, తమ కుటుంబ సభ్యులలో ఒకరు విద్యాశాఖ జారీ చేసిన గుర్తింపు కార్డులతో గుంటూరులోని పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళా శాలకు రావాలన్నారు. ప్రత్యేక బస్సుల్లో సచివా లయ సమీపంలో జరిగే నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి తీసుకెళ్తామని అభ్యర్థు లు గమనించాలని డీఈవో తెలిపారు.

ప్రతిపాదనలు.. పక్కనపెట్టారు..

నామ్‌కేవాస్తిగా జడ్‌ఆర్‌యూసీసీ సమావేశం

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జోనల్ రైల్వే యూజర్స్ సంప్రదింపు కమిటీ సమావేశానికి గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి హాజరైన సభ్యుల ప్రతిపాదనలకు దక్షిణ మధ్య రైల్వేజోనల్ అధికారుల నుంచి స్పష్టమైన సమాధానాలు రాలేదు. సభ్యులు చేసిన ప్రతిపాదనలను పరిశీలిస్తాం, పైకి పంపిస్తాం వంటి సమాధానాలతో మమ అనిపించారు. ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన 76వ జడ్‌ఆర్‌యూసీసీ సమావేశం నామ్‌కే వాస్తేగా మారింది తప్ప డివిజన్‌కు ఒరిగేది ఏమీ లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ సమావేశానికి గుంటూరు జిల్లా నుంచి వీ శ్రీధర్, ఆతుకూరి ఆంజనేయులు, వంశీ కృష్ణ, పల్నాడు జిల్లా నుంచి రాధ, జే శ్రీనివాసరావు హాజరయ్యారు. వీరు పలు ప్రతిపాదనలను జోనల్ అధికారులకు నివే దించగా అన్నింటినీ పక్కన పెట్టారని సమాచారం.

- శంకర్‌విలాస్ ఆర్వోబీ కూల్చివేసిన కారణంగా జీజీహెచ్‌కు వెళ్లే రోగులు, సహాయకులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ దృష్ట్యా త్వరగా ఒక ఫుట్‌బ్రిడ్జిని నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు రైల్వే అధికారులు ఆ పనిని రాష్ట్ర ప్రభుత్వ జాతీయ రహదారుల విభాగం చూస్తున్నదని, ఆ సంస్థకు తాము విజ్ఞప్తి చేస్తామని చెప్పారు.
- గుంటూరు - తిరుపతి మధ్య నంద్యాల మార్గంలో రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్‌ని అరుణాచలం వరకు పొడిగించాలని చేసిన ప్రతిపాదనపై రైల్వే అధికారులు సమాధానం ఇస్తూ గత నెలలో రైల్వేబోర్డుకు పంపిం చామన్నారు.
- మచిలీపట్నం - యశ్వంత్‌పూర్ ట్రైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ని మైసూరు వరకు పొడిగించి, డైలీ సర్వీసు చేయాలని కోరగా ఐఆర్‌టీటీసీకి నివేదిస్తామన్నారు.
- గుంటూరులో శంకర్‌విలాస్ ఆర్‌వోబీ పూర్తికి మూడేళ్లు పట్టే అవకాశం ఉన్నందున ముఖ్యమైన రైళ్లకు నల్లపాడులో హాల్టింగ్ కల్పిస్తే గుంటూరు రైల్వేస్టేషన్ వద్ద కొంత మేరకు ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని చేసిన ప్రతిపాదనకు కమర్షియల్ విభాగం జస్టి ఫికేషన్‌ని కోరతామన్నారు.
- గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫాం త్వరగా పూర్తి చేసి కొన్ని రైళ్లను పశ్చిమ వైపున నిలపాలని ప్రతిపాదించారు. దీనికి రైల్వే అధికారులు సివిల్ వర్కులు వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి అవుతాయని, అప్పుడు చూస్తామని సరిపెట్టారు.
- కాచీగూడ - నడికుడి రైలుని పిడుగురాళ్ల వరకు పొడిగించాలని చేసిన ప్రతిపాదనని కూడా మెయిన్‌టెనెన్స్ బ్లాకులు కారణంగా తిరస్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.



రింగురోడ్డు సిద్ధార్థ కల్యాణ మండపం వద్ద...

వానొస్తే.. మునకే

- నగరం మొత్తం నరకప్రాయం
- చెరువులా మారుతోన్న ఆర్టీసీ బస్టాండ్



గుంటూరు-1 డిపో గ్యారేజ్‌లో చేరిన వర్షపు నీరు



మూడొంతెనల వద్ద భారీగా నిలిచిన వాహనాలు

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా వర్షాలతో ఉపశమనం పొందుతారు. అయితే గుంటూరు వాసులు మాత్రం వర్షం వస్తే మునిగిపోతున్నామని ఆందోళన చెందు తున్నారు. పది పదిహేను నిమిషాల వర్షానికే నగరంలో నరకం కనిపిస్తోందని ప్రజలు వాపోతున్నారు. చినుకు పడు తుందంటే ప్రజలు వణికిపోతున్నారు. ఎక్కడికక్కడ డ్రెయిన్లు పొంగి ప్రధాన రోడ్లు సైతం తటాకాల్లా మారుతున్నాయి. దీంతో వాహన చోదకులు అల్లాడుతున్నారు. బుధవారం ఉద యం కొద్దిసేపు కురిసిన వర్షానికి శ్రీనగర్, రింగురోడ్డు, బ్రాడీ పేట, మూడువంతెనలు తదితర ప్రాంతాల్లో భారీగా వర్షం నీరు చేరింది. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు స్తంభిం చాయి. మూడువంతెనలు, కంకరగుంట అండర్ పాస్‌ల్లో అయితే వాహనదారులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఓ మోస్తరు వర్షానికే మోకాలి లోతున నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. లోతట్టు ప్రాంతాల్లో అయితే ఆ నీరు రోజుల తరబడి నిలిచి అపరిశుభ్రత తాండవించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా నగరంలో ఓ మోస్తరు వర్షానికి ముంపుబారిన పడుతున్నా నగర పాలక సంస్థ అధికారులు కనీస చర్యలు కూడా తీసుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరచూ ముంపు ముం చుకు వస్తున్నా ప్రజాప్రతినిధులు కూడా నిర్లక్ష్యంగా ఉంటు న్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఓ మోస్తరు వర్షానికే ఎన్టీఆర్ బస్టాండ్ ఆవరణ చెరువును తలపిస్తోంది. ఇటీవల కురిసిన వర్షానికి బస్టాండ్ ఆవరణతో పాటు గ్యారేజ్‌లను వరద నీరు ముంచెత్తింది. గ్యారేజ్‌లలో అయితే వర్షపు నీరు వరదలా పారుతోంది. దాంతో గ్యారేజ్‌లో బస్సులు, సామగ్రిని కాపాడుకోలేక సిబ్బంది నానా యాతన పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రెండు రోజుల పాటు గ్యారేజ్‌లలో నీరు నిల్వ ఉంది.

అంధురాలిపై..రాబంధువుల కుట్ర!
- తల్లిదండ్రుల మరణంతో రూ.40 కోట్ల ఆస్తికి ఎసరు
- తప్పుడు పత్రాలతో ఆస్తుల రిజిస్ట్రేషన్
- సోదరుడి ఫిర్యాదుతో ఆరుగురి అరెస్టు

ఆర్యవైశ్య సంఘ భవనం అక్రమ రిజిస్ట్రేషన్
- బ్యాంకు రుణానికి వెళ్లడంతో వెలుగు చూసిన వైనం

డిమాండ్ కంటే అదనంగా యూరియా
- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

8లో..



ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై బాలింతను అడిగి తెలుసుకుంటున్న మంత్రి మనోహర్

మహిళల ఆరోగ్యం.. మోదీ సంకల్పం

పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని మహిళలందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రధాని మోదీ సంకల్పించారని, ఇందుకోసం దేశ వ్యాప్తంగా స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను ప్రకటించారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఈ కార్యక్రమాన్ని బుధవారం మంత్రి ప్రారంభించారు. 40 మంది వృద్ధులకు వీల్‌చైర్లు, వాకింగ్ స్టిక్స్, హియరింగ్ బడ్స్ పంపిణీ చేశారు. ఆసుపత్రిలో రోగులను అడిగి సౌకర్యాలు, వైద్యసేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబాన్ని కూడా ఆరోగ్యంగా ఉంచుతారని తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం దేశంలో రూపుదిద్దుకుంటుందన్నారు. మహిళా సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, డాక్టర్ హనుమంతరావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమర్థంగా స్త్రీశక్తి పథకం అమలు

● ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.అప్పలరాజు


మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు అప్పలరాజు, చంగల్‌రెడ్డి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ శక్తి పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని.. ప్రయాణంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని ఆర్టీసీ నిర్వహణ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.అప్పలరాజు పేర్కొన్నారు. తెనాలి ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. స్టేషన్‌తో పాటు డిపో గ్యారేజీ పరిశీలించి బస్సుల సంఖ్య, కండిషన్, రోజువారీ తిరిగే కిలోమీటర్లు, సిబ్బంది కొరత, మహిళల నుంచి ఎదురవుతున్న సమస్యలపై సమీక్షించారు. స్త్రీ శక్తి పథకం తెనాలి ప్రాంతంలో మహిళలకు బాగానే ఉపయోగపడుతుందన్నారు. మహిళల పట్ల సిబ్బంది సహనంతో వ్యవహరించాలని, గుర్తింపు ఏదైనా, దాని నకలు తెచ్చినా అనుమతించాలని చెప్పారు. బస్సుల రద్దీకి అనుగుణంగా ట్రిప్పులను పెంచాలని, బస్సుల సంఖ్య సరిపోకపోతే ప్రతిపాదనలు పంపించాలని కోరారు. బస్ స్టేషన్‌లో ఆవరణలో సహచర ఈడీలతో కలిసి మొక్కలు నాటారు. ఆయనతో పాటు ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంగల్‌రెడ్డి, జోన్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, మేనేజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రత్నషీలామణికి అభినందనలు


రత్న షీలామణిని అభినందిస్తునన వీసీ గంగాధరరావు, రిజిస్ట్రార్ సింహాచలం

ఏఎన్‌యూ సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్-2గా నియమితులైన ఆచార్య కె.రత్నషీలామణికి బుధవారం వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. సీనియర్ ఆచార్యులుగా, ప్రిన్సిపాల్, పరిశోధన విభాగం సమన్వయకర్త, రెక్టార్‌గా రత్నషీలా మణి సేవలను కొనియాడారు. అలాగే ఓఎస్డీ రవికుమార్, దూరవిద్య సంచాలకులు వెంకటేశ్వర్లు, పలువురు డీన్లు, ప్రొఫెసర్లు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పచ్చదనంపై వేటు

● దశాబ్దాల క్రితం నాటిన చెట్లు నరికివేత
● కళాశాల ప్రిన్సిపాల్‌పై స్థానికుల ఫిర్యాదు
● విచారణకు మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలు


పాఠశాల ఆవరణలో మొద్దులు

రేపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లుతో ఆహ్లాదకర వాతావరణంతో నిండిన విద్యా ప్రాంగణం ప్రస్తుతం వెలవెలపోతోంది. చెరుకుపల్లి మండలం కావూరు రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ ఆవరణలో రెండు దశాబ్దాల క్రితం నాటిన మొక్కలు మహావృక్షాలుగా మారాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు వాటి నీడలో సేదతీరేవారు. అలాంటి చెట్లను ఉన్నతాధికారుల అనుమతి లేకుండా బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి నరికివేస్తున్నారని విద్యార్థులు తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో తల్లిదండ్రులతో పాటు, స్థానికులు కళాశాలకు వచ్చి ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. కరెంటు వైర్లకు అడ్డం వస్తున్నాయని అందువల్లే తొలగిస్తున్నామని ప్రిన్సిపాల్ సమాధానం చెప్పారు. విద్యుత్ అధికారులకు స్థానిక నాయకులు ఫోన్ చేసి రెసిడెన్షియల్ కాలేజీలో మొక్కలను తొలగించమన్నారా అని ప్రశ్నించారు. అయితే తమకు ఎలాంటి సంబంధం లేదని విద్యుత్ అధికారులు చెప్పారు. కూలీలను ప్రశ్నించగా ప్రిన్సిపాల్ అవనిగడ్డకు చెందినవారికి అమ్మేశారని అందువల్లే నరికామని నరికామని చెప్పారు. ప్రభుత్వ స్థలాల్లో చెట్లను నరకాలంటే సంబంధిత అధికారులతో పాటు అటవీశాఖ అధికారులు అనుమతి తప్పనిసరి. అయితే వాటిని పట్టించుకోకుండా ప్రిన్సిపాల్ ఏకపక్ష నిర్ణయంతో, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా రూ.లక్షలకు చెట్ల కొట్టించి అమ్మేశారని స్థానికులు ఆరోపించారు. చెట్ల నరికివేతపై అటవీశాఖ అధికారులకు తెలిపినా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు తెలిపారు. ఆపై వారు ప్రిన్సిపాల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కొట్టేసిన చెట్ల మొద్దులను, ట్రాక్టర్లను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈవిషయమై మండల విద్యాశాఖాధికారి నవీన్‌కుమార్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. చెట్ల నరికివేతపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు.

పారిశ్రామికాభివృద్ధి, యువత ఉపాధే ధ్యేయం

● ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్

గుంటూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనే ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. ఏపీఐడీసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన బోర్డు మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. నూతన ఏపీఐడీసీ డైరెక్టర్లను అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారిపోయిందన్నారు. రాష్ట్రమంతటా పారిశ్రామిక అనుకూల వాతావరణం ఏర్పడిందని, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చొరవతో రాష్ట్రానికి పెట్టు బడుల వెల్లువ మొదలైందన్నారు. దాంతోపాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం భారీ రాయితీలు ఇచ్చి ప్రోత్స హిస్తోందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగాన్ని నిర్మూలించి ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు రాయితీపై పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నా రు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఎండీ, డైరెక్టర్లు బాలభారతి, రాజారావు, రమణయ్య, మనోజ్ కుమార్, పండితి మల్హోత్రా పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్

ఏఎన్‌యూలో జిరోధా వర్సిటీ ఇండియాస్ ప్రీమియర్ ఫైనాన్స్ క్విజ్

● ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన పీబీ సిద్ధార్థ, ఆర్వీఆర్ జేసీ, విజ్ఞాన్

ఏఎన్‌యూ సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జిరోధా వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియాస్ ప్రీమియర్ ఫైనాన్స్ క్విజ్ విజయవంతంగా బుధవారం ముగిసింది. డాక్టర్ ఎస్. జాన్ డేవిడ్ ఆడిటోరియంలో దేశంలోని వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి 92 జట్లలో 276 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల ప్రథమ బహుమతి రూ.12,000 గెలుచుకోగా, ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ బహుమతి రూ.9,000 సాధించింది. విజ్ఞాన్ యూనివర్సిటీ రూ.3,000 తృతీయ బహుమతి గెలుచుకుంది. ఏఎన్‌యూ (యూజీ), (ఎంబీఏ), విజ్ఞాన్ యూనివర్సిటీ జట్లు ఉత్తమ ప్రదర్శన కనబర్చినందుకు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నాయి. వర్సిటీ ప్రొఫెసర్లు, ముఖ్య అతిథులు హాజరై విద్యార్థులను అభినందించారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరించారు. కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నిర్వహణ బాధ్యతలు చేపట్టింది.


క్విజ్ విజేతలతో డీన్ ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్

డీ-3 సెక్షన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

● రూ.3.45 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ నేతృత్వంలో గుంటూరు -1 డివిజన్‌లో డీ-3 సెక్షన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ బృందాలు బుధవారం విస్తృతంగా తనిఖీ చేశారు. డీపీఈ ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో 58 మంది అధికారులు, 174 మంది సిబ్బంది 58 బృందాలుగా ఏర్పడి 4228 సర్వీసులకు తనిఖీలు నిర్వహించారు. మొత్తం 115 మందికి రూ.3.45 లక్షల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 9440812263. 9440812361కు చేయాలని కోరారు. తనిఖీల్లో విజి లెన్స్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకన్నచౌదరి, డిప్యూటీ ఈఈ ముస్తాక్ అహ్మద్, రవికుమార్, ఎన్ మల్లికార్జున ప్రసాద్, ఎస్ శ్రీనివాసరావు, ఆపరేషన్ ఏఈ ఎమ్ చంద్రశేఖర్, కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, శివశంకర్ తదితరులున్నారు.

ఏడో రోజు కొనసాగిన ఉపాధ్యాయుల ఆందోళన


సమస్యల పరిష్కారం కోసం సీఎం, ముఖ్యకార్యదర్శికి మెయిల్స్ పంపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ న్యాయమైన ఆర్థిక డిమాండ్స్ సాధనకు ఏపీటీఎఫ్ చేపట్టిన నిరసన వారం ఏడో రోజు కొనసాగింది. ఇందులో భాగంగా బుధవారం ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి, ముఖ్య కార్యదర్శికి సమస్యలు పరి ష్కరించాలని మెయిల్స్ పంపినట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు తెలి పారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయులతో కలసి మెయిల్స్ పంపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా కార్యదర్శి జీ దాస్, ఆడిట్‌కమి టీ సభ్యులు వి.కిషోర్, జిల్లా కౌన్సిలర్లు కె.శ్రీనివాసరావు, పి.వేణు గోపాలరావు ఇతరులు పాల్గొన్నారు.

అమృతవల్లికి జీవిత సాఫల్య పురస్కారం

ఏఎన్‌యూ సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వృక్షశాస్త్రం, సూక్ష్మజీవ శాస్త్రవిభాగం ఆచార్యులు అడిహూడి అమృత వల్లి బుధవారం జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. జమ్మూలోని షేర్ ఈ కశ్మీర్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ టెక్నాలజీలో మూడు రోజు లుగా పుడమి- పంటల సంరక్షణే ధ్యేయంగా దేశ వ్యాప్తంగా పరిశోధకులు, విజ్ఞాన వేత్తలతో సదస్సు జరిగింది. ఏషియన్ పీజీపీఆర్ సొసైటీ భారతీయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సదస్సుకు ఆమె అధ్యక్షత వహించారు. దశాబ్దానికి పైగా పీజీపీఆర్ అధ్యక్షురాలిగా ఆమె సేవలకు, మూడు దశాబ్దాలకు పైగా అధ్యాపకురాలిగా పరిశోధనలకు గానూ ఈ పురస్కారం లభించింది. పలు యూనివ ర్సిటీల డైరెక్టర్లు, ఏఎన్‌యూ ప్రొఫెసర్లు, సిబ్బంది ఆమెను అభినందించారు.


జీవిత సాఫల్య పురస్కారం అందుకుంటున్న అమృతవల్లి

అమ్మో బార్లా

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తులు వచ్చిన బాపట్లలో 2, చీరాలలో 3, రేపల్లెలో 1 బార్‌కు లాటరీ ప్రక్రియ గురువారం ఉదయం 8 గంటలకు కలెక్టరేట్ వేదికగా జరుగుతుందని ఎక్సైజ్ విభాగం తెలిపింది. అయితే మిగిలిన 9 బార్ల విషయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తొలిసారి 4, రెండోసారి 6 బార్లకు వచ్చిన దరఖాస్తులు విషయంలోనే ఎక్సైజ్ విభాగం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. పలుసార్లు ఆశావహులతో సంప్రదింపులతో పాటు, కొంతమందికి స్థానిక నేతలతో చెప్పించడం తోనే ఈ మాత్రం ఫలితాలు కనబడ్డాయని, ఇకపై మిగిలిన బార్ల విషయంలో నోటిఫికేషన్ ఇచ్చినా పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చనే అభిప్రాయాన్ని అంతర్గత సంభాషణల్లో ఎక్సైజ్ సిబ్బందే వ్యక్తం చేస్తున్నారు.

- గుంటూరు జిల్లాలో 67 బార్లకు 26 బార్లకు మాత్రమే నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో బార్‌కు నాలుగు చొప్పున 104 దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన 41 బార్లకు దరఖాస్తులు రాలేదు.
- పల్నాడు జిల్లాలో 30 బార్లలో 8 బార్లకు నాలుగు దరఖాస్తుల చొప్పున 32 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

రెరా చైర్మన్ పదవికి శివారెడ్డి వన్నె తెస్తారు

● అభినందించిన నరెడ్కో గుంటూరు ప్రతినిధులు


రేరా చైర్మన్ శివారెడ్డిని అభినందిస్తున్న నరేడ్కో ప్రతినిధులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రెరా చైర్మన్ ఎ.శివారెడ్డి ఆ పదవికి వన్నె తెస్తారని నరెడ్కో క్యాపిటల్ జోన్ ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం ఆయనను పదవి బాధ్యతలను స్వీకరించిన అనంతరం సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. శివారెడ్డి మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగం రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. స్టేక్ హోల్డర్స్‌తో కలిసి పారదర్శకత, సామర్థ్యం, వేగవంతమైన అభి వృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. రెరా ద్వారా నిబంధనలు కచ్చితంగా అమలు చేయడంతో పాటు, డెవలపర్స్, వినియోగదారుల ప్రయోజనాలు రక్షణ పొందే లా చూడడం తమ లక్ష్యం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నరెడ్కో క్యాపిటల్ జోన్ అధ్యక్షుడు కేసీ హెచ్ అంకారావు, ఉపాధ్యక్షుడు వి శ్రీనాథ్, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, చిన తిరుపతయ్య పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చప్టా

యథేచ్ఛగా భారీ వాహనాల రాకపోకలు


పెదమద్దూరు వంతెనపై దిగబడిన ఇసుక లారీ

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని పెదమద్దూరు వాగు ప్రమాదకరంగా మారింది. అమరావతి -విజయవాడ మార్గంలో గతంలో నిర్మించిన లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరింది. బుధవారం తుళ్లూరు వైపు నుంచి ఇసుక లోడుతో వస్తున్న లారీ వంతెనపై దిగబడింది. ఎక్సవేటర్‌తో ఇసుకను తొలగించి వాహనాన్ని తొలగించారు. ఈ పరిస్థితుల్లో వంతెనపై భారీ వాహనాల రాకపోకలను నిలుపుదల చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యుత్ ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి

గుంటూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ సీపీడీసీఎల్) పరిధిలో విద్యుత్ ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియ మంగళవారంతో పూర్తయింది. సర్కిల్స్ విభజన ప్రక్రియ తర్వాత ఉద్యోగుల విభజన ప్రక్రియ కొలిక్కి వచ్చిన విషయం తెలిసిందే. పలువురు జూనియర్ ఉద్యోగులు గుంటూరు నుంచి పల్నాడు, బాపట్ల సర్కిల్స్‌కు వెళ్లాల్సి వచ్చింది. బాపట్ల, పల్నాడు సర్కిల్స్ నుంచి పలువురు ఉద్యోగులు గుంటూరు సర్కిల్‌కు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులతో పాటు విభజనతో వచ్చిన ఉద్యోగులకు రీ పోస్టింగ్‌లు కల్పిస్తూ మంగళవారం రాత్రి గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల విభజనతో గుంటూరు సర్కిల్ పరిధిలోని గుంటూరు, తెనాలి డివిజన్‌ల నుంచి పలువురు జూనియర్ ఉద్యోగులు సీఆర్‌డీఏ, బాపట్ల జిల్లాలకు వెళ్లడంతో అక్కడ ఉన్న పలువురు సీనియర్ ఉద్యోగులు జిల్లా కేంద్రం గుంటూరుకు వచ్చినట్లయింది. ఉన్న ఉద్యోగులతో పాటు విభజనతో సర్కిల్‌కు వచ్చిన ఉద్యోగులను సర్దుబాటు చేసేందుకు ఎస్ఈ రెండు రోజుల పాటు కసరత్తు చేశారు.

● తెనాలి ఈఈ చిరంజీవికి ఎస్ఈగా

గుంటూరు సర్కిల్ పరిధిలో పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పీ పుల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం తెనాలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా వీవీ చిరంజీవికి సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా (ఎస్ఈ)గా పదోన్నతి కల్పించారు. గుంటూరు టౌన్ 4 డిప్యూ టీ ఈఈ పి. హుస్సేన్ ఖాన్‌కు ఈఈగా, ఇన్‌చార్జ్‌లు రాజేష్‌ఖన్నా, ఎ.సత్య నారా యణకు ఈఈలుగా పదోన్నతి కల్పించారు. నగరంలో లైన్స్ ఏఈ సుబ్బారావు, డీ4 ఏఈ అంజనీరావు డిప్యూటీ ఈఈలుగా పదోన్నతి పొందారు. వారికి పోస్టింగ్‌లు కేటాయించాల్సి ఉంటుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

41,629 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 42,909 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 41,629 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,081 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12300
334	10500	14500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13800	334	10500	14600
273	10000	13300	నెంబరు. 5	----	----
341	10000	15300	273	----	----
4884	----	----	341	10000	16000
సూపర్ 10	11500	14000	4884	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14800	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15600
బ్యాడిగి	10000	15600	దేవనూరు డీలక్స్	10500	14000
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7400



కలెక్టరేట్‌లో జరిగిన విరాట్ విశ్వకర్మ జయంతిలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఘనంగా విరాట్ విశ్వకర్మ జయంతి

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చేతివృత్తుల కళాకారులైన విశ్వకర్మల అభి వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యంతో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలి పారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు నిర్వహించిన కలెక్టర్ల సదస్సు లో స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్ ప్లాన్‌లో జీడీపీకి సంబంధించి ఎకనామిక్ గ్రోత్ తరు వాత, రెండో ప్రాధాన్య అంశంగా సంక్షేమ కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో సమీక్షించార న్నారు. అన్ని కులాల సంక్షేమం, అభివృద్ధికి కోసం ప్రవేశపెట్టిన అన్ని పథకాలు పటిష్ఠంగా అమలు చేయాలని సీఎం స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం సమన్వయ కమిటీ చైర్మన్ ఎం వెంకటప్రసాద్, గుంటూరు టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాసరావు, గుంటూరు పార్లమెంటరీ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జంపని నాగేశ్వరరావులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజవలి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధి కారి మయూరి, బీసీ సంక్షేమ సంఘాలు, విశ్వకర్మ సంక్షేమ సంఘాల నాయకులు, ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచాన్ని నిర్మించిన దివ్య శిల్పి విశ్వకర్మ

● జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా

గుంటూరు సిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని చూడ చక్కని అందాలతో నిర్మించిన దివ్య శిల్పి విశ్వకర్మ అని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. బుధవారం జిల్లా పరిషత్‌లో జరిగిన విశ్వకర్మ జయంతి కార్యక్ర మంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ, ఏవో శామ్యూల్ పాల్, మినిస్టీరియల్ సిబ్బంది రాష్ట్ర నాయకుడు కూచిపూడి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, డిప్యూటీ సీఈవో కృష్ణ

డ్రెయిన్స్ ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో డ్రైన్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను వెంటనే తొలగిం చాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారు లకు స్పష్టం చేశారు. బుధవారం జీజీహెచ్ దగ్గరలోని సెయింట్ జోసఫ్ స్కూల్లో వర్షం నీరు నిలిచిందని అందిన ఫిర్యాదు మేరకు కమిషనర్ సదరు స్కూల్‌ని పరిశీలించి, స్కూల్ ఎదుట డ్రెయిన్‌పై ఆక్రమణలను తొలగించారు. వార్డ్ సచివాలాయాల వారీగా ఆక్రమణలు జరిగే తొలి దశలోనే అడ్డుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



డ్రెయిన్స్‌లో ఆక్రమణలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నేడు నగరంలో మెగా ర్యాలీ

స్వచ్ఛ ఉత్సవంలో భాగంగా నేడు ఉదయం 7 గంటలకు కలెక్టర్ కార్యాలయం నుంచి హిందూ కాలేజీ సిగ్నల్ జంక్షన్ వరకు గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మెగా ర్యాలీ జరుగుతుంది కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ, నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతిని ధులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఏచూరి స్ఫూర్తితో సామ్రాజ్యవాదంపై పోరాటం

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు, వేదికపై బాబురావు, వై.నేతాజీ తదితరులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మతోన్మాదానికి, సామ్రా జ్యవాదానికి వ్యతిరేకంగా సీతారాం ఏచూరి స్ఫూర్తితో ప్రతిఒక్కరూ పోరాడా లని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి, సభ నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వై నేతాజీ అధ్యక్షతన జరిగిన సభలో లక్ష్మణరావు మాట్లాడు తూ ఏచూరి మతోన్మాదంపై, సామ్రాజ్యవాదంపై చివరి శ్వాస వరకూ పోరాడా రన్నారు. ప్రపంచంలో పెట్టుబడిదారీ సమాజం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొం టుందని, సామ్రాజ్యవాదానికి పెద్దన్నగా ఉన్న అమెరికా వివిధ దేశాలపై పెం చుతున్న సుంకాలే అందుకు నిదర్శనమని చెప్పారు. ఈ కార్యకమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు, ఎస్.భావన్నారాయణ, ఈమ ని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మెగా ర్యాలీపై ట్రయల్ రన్



ఆటోలపై పూలు జల్లుతున్న మున్సిపల్ సిబ్బంది

గుంటూరులో జరిగే స్వచ్ఛ ఉత్సవంలో భాగంగా మెగా ర్యాలీ చేపట్టేం దుకు ఈ ఆటోలతో కంకరగుంట బ్రిడ్జిపై ట్రయల్ రన్ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు. - గుంటూరు (ఆంధ్రజ్యోతి)

అధ్వానంగా పలకలూరు రోడ్డు

● వర్షం దాటికి ఎక్కడికక్కడ భారీ గుంతలు
● అధికారుల అనాలోచిత నిర్ణయమే కారణం
● మరమ్మతుల పేరిట ఏటా లక్షల్లో ప్రజాధనం వృథా

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాది వాహనాలు రాక పోకలు సాగించే పలకలూరు రోడ్డు అధ్వానంగా తయారైంది. గుజ్జనగుండ్ల సెంటర్ నుంచి కృష్ణబాబు కాలనీ వరకు రోడ్డు పూర్తిగా పాడైంది. గుజ్జనగుండ్ల సెంటర్ నుంచి వెళ్తుంటే ముఖ్యంగా డివైడర్‌కు కుడివైపున ఉన్న రోడ్డు అస్త వ్యస్తంగా తయారైంది. అనేక చోట్ల అడుగు నుంచి రెండు అడుగుల గుంతలు ఏర్పడ్డాయి. మరి కొన్నిచోట్ల గుంతలు అత్యంత ప్రమాదకరంగా తయారవడం తో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొద్ది నెలల క్రితం ఇదే తరహా లో రోడ్డు దారుణంగా తయారవగా నగరపాలక సంస్థ అధికారులు ప్యాచ్ వర్క్ చేశారు. తిరిగి రోడ్డు అధ్వానంగా తయారైంది.

ఇంజనీరింగ్ అధికారుల అనాలోచిత నిర్ణయమే కారణం

నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారుల అవగాహన రాహిత్యం, అనాలో చిత నిర్ణయం కారణంగా నిత్యం పలకలూరు రోడ్డు అధ్వానంగా తయారవు తోంది. ప్రతిసారి తాత్కాలిక మరమ్మతుల పేరుతో లక్షల రూపాయలు వెచ్చిం చినా తిరిగి రోడ్డు దారుణంగా తయారవుతుంది. రోడ్డు కింద ఉన్న వాటర్ పైప్‌లైన్‌లే దీనికి కారణం. గతంలో పలకలూరు రోడ్డు సింగిల్ రోడ్డుగా ఉన్న ప్పుడు రోడ్డు పక్కన మంచినీటి పైపులైన్లు ఉన్నాయి. రోడ్డు విస్తరణ సమయం లో పైపు లైన్‌లను తొలగించి ప్రస్తుతం విస్తరించిన రోడ్డు పక్కన పైపులైన్లను వేయాల్సి ఉన్నప్పటికీ, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు పాత పైపు లైన్లను యథావిధిగా కొన సాగించారు. దీంతో రోడ్డు విస్తరణలో ఆయా పైపులు ప్రస్తుతం ఉన్న రోడ్డు కు మధ్యలోకి వచ్చాయి. అంతేగాక పైపు లైన్‌లకు నిత్యం లీకులు ఏర్పడు తుండటంతో వాటి మరమ్మతుల కోసం రోడ్డును తవ్వుతున్నారు. దీంతో రోడ్లు ఎక్కడికక్కడ గుంతలమయంగా మారుతున్నాయి. ఎన్నిసార్లు రోడ్లు వేసినా పైప్ లైన్ లీకేజీ కారణంగా నీరు పైకి ఉబుకు తుండటంతో రోడ్లు మెతకబారి గుంతలు పడుతున్నాయి. వాటికి ప్యాచ్ వర్క్ చేసినా మూణ్నా ళ్ల ముచ్చటగానే మారుతున్నాయి. మరో వైపు ఈ రోడ్డులో నిత్యం టిప్పర్లు, భారీ వాహనాలు, వాటర్ ట్యాంకర్లు తిరుగుతుండడంతో రోడ్డు తొంద రగా దెబ్బతింటుంది. ఆయా రోడ్ల మరమ్మతుల కోసం లక్షల రూపాయలు వెచ్చించాల్సి వస్తుంది. ఫలితంగా ఏటా నగర పాలక సంస్థ లక్షలాది రూపాయల ప్రజా ధనం వృథాగా ఖర్చు చేయాల్సి వస్తోంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆయా గుంతలు చెరువులను తలపిస్తు న్నాయి. దీంతో పలకలూరురోడ్డు రూపురేఖలే మారిపోయాయి. ఆ రోడ్డులో ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి తక్షణం రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతు న్నారు. పైప్‌లైన్‌లపై తక్షణం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.





పలకలూరు రోడ్డులో భారీగా ఏర్పడిన గుంతలు

తురకపాలెంలో కలెక్టర్ అన్సారియా పర్యటన

● గ్రామస్థులకు ధైర్యం చెప్పిన కలెక్టర్

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంతు చిక్కని మర ణాలతో ఆందోళనలో ఉన్న తురకపాలెంలో బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా పర్యటించారు. వీధి వీధినా పర్యటించిన కలెక్టర్, గ్రామస్థులకు ధైర్యం చెప్పారు. ఇక్కడ సాధారణ పరిస్థితులు నెలకొంటున్నట్లు ప్రకటిం చారు. ఇటీవల తురకపాలెంలో నాలుగు నెలల వ్యవధిలో 30 మందికిపైగా స్థానికులు అంతుచిక్కని అనారోగ్యంతో మృతి చెందటం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. దీనిపై ఆరోగ్యశాఖ అప్రమత్తమై రెండు వారాల నుంచి గ్రామంలో వైద్యశిబిరం నిర్వహిస్తూ గ్రామస్థులంద రికీ ఆరోగ్య పరీక్షలు చేస్తోంది. కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తమీమ్ అన్సారియా బుధవారం తురకపాలెం సందర్శించారు. గ్రామంలోని రెండు తాగునీటి పథకాల నుంచి పంపిణీ చేస్తున్న నీటి సరఫరా ను పరిశీలించారు. ప్రధాన కూడళ్లల్లో పర్యటించి పారిశుధ్య పరిస్థితి పరిశీ లించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని తనిఖీ చేశారు. గ్రామస్థులతో మాట్లాడి పరిస్థితు లపై ఆరా తీసారు. అనారోగ్య పరిస్థితులు తలెత్తితే తక్షణం వైద్య శిబిరాన్ని వినియోగించు కోవాలని కోరారు. దగ్గరలో పెద్ద పలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉందని, అక్కడ వైద్యసేవలు పొందవచ్చని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని తెలిపారు. వైద్య పరీక్షల వివరాలు తక్షణం గ్రామస్థులకు అందించాలని కలెక్టర్ ఆరోగ్యశాఖ అధికా రులను ఆదేశించారు.



తురకపాలెంలో మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

వైద్య పరీక్షల వివరాలను తెలిపిన డీఎంహెచ్‌వో..

తురకపాలెంలో ఆరోగ్యశాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే విజయలక్ష్మి, గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, కలెక్టర్‌కు వివరించారు. తాగునీటి సరఫరాపై గ్రామీణ నీటి సర ఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కళ్యాణ చక్రవర్తి వివరించారు. గ్రామస్థులు మాట్లాడు తూ జూన్, జులై నెలల్లో తాగునీటి కొరత వస్తుందని, శాశ్వత పరిష్కారం కోసం గుం టూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అతిసార బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అతిసార కేసులకు మెరుగైన వైద్యం అందిం చాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం గుం టూరు నగరంలో వివిధ ప్రాంతాల నుంచి నమోదైన అతిసార కేసులపై నగర పాలక సంస్థ కమిషనర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెం డెంట్‌లు తక్షణం నివేదిక సమర్పించాలని ఆమె ఆదేశించారు. కొత్తగా కేసులు నమోదు కాకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆస్పత్రుల్లో ఉన్నవారికి సరైన వైద్యసేవలు అందించాలని అన్నారు. ప్రజలు మరగ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. బ్లీచింగ్ వెద చల్లాలని చెప్పారు. ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. గుంటూరు జీజీహెచ్‌లో 17 ప్రాంతాలకు చెందిన దాదాపు 33 కేసులు రిపోర్ట్ కాగా, సంబంధిత అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారులను ఆ ప్రాంతాల్లో ఇంటిం టికీ సర్వే చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆ ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేయాలని అన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలని అన్నారు.

కేసులు రిపోర్ట్ అయిన ప్రాంతాలు

పాత గుంటూరు, రెడ్లబజార్, బుచయ్యతోట, హనుమయ్యనగర్, తారకరామనగర్, భాగ్యనగర్, రైల్వేస్టేషన్, శ్రీనగర్, డొంకరోడ్, సంపత్‌నగర్, రామిరెడ్డి పేట, ఆర్టీసీ కాలనీ, మంగళదాస్ నగర్, నల్లచెరువు, ఓబులనాయుడుపాలెం, తెనాలి, తాడేపల్లి.



తురకపాలెంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తురకపాలెంలో మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం తురక పాలెంలో ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబాలను రాష్ట్ర ప్రభు త్వం ఆదుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. తురకపాలెంలో మాజీ ఎమ్మెల్యేలు షేక్ మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్, ప్రత్తిపాడు ఇన్‌ఛార్జ్ కొరివి వినయ్‌కుమార్ పలువురు నాయకులు బాధిత కుటుంబాలను బుధవారం పరామర్శిం చారు. వారు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాచకొండ జాన్‌బాబు, గడ్డం పాల్‌విజయ్‌కుమార్, బిళ్లా సునీల్, బొట్ల బ్రహ్మం, రత్తయ్య, కిరణ్ తదితరులున్నారు.

సమీక్షా సౌరభాలు పుస్తకావిష్కరణ

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బృందావన్ గార్డెన్స్, శ్రీవేంకటేశ్వర దేవాలయం పద్మావతీ కల్యాణవేదికపై డాక్టర్ వెలువోలు నాగ రాజ్యలక్ష్మి రచించిన సమీక్షా సౌరభాలు గ్రంథావిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా ఏఎన్‌యూ పూర్వ రిజిస్ట్రారు రావెల సాంబ శివరావు హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ నాగరాజ్యలక్ష్మి ప్రాచీన, ఆధునిక సాహిత్య రంగాల్లో ప్రజ్ఞావంతురాలని కొనియాడారు. ప్రముఖ కవి డాక్టర్ బీరం సుందర రావు గ్రంథసమీక్ష చేశారు. సభకు టీజేపీఎస్ కళాశాల పూర్వ ప్రధానాధ్యాపకురాలు టి. రాధాబాయి అధ్యక్షత వహించగా డాక్టర్ మైలవరపు లలితకుమారి, రంగారావు, పాపినేని శివశంకర్ పాల్గొన్నారు.

అపార్టుమెంట్ సెల్లార్లో అగ్నిప్రమాదం

● ఏడు ద్విచక్ర వాహనాలు, రెండు సైకిళ్లు దగ్ధం

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని అమరావతిలో గల ఐడీ ఆస్పత్రి వెనుక ఉన్న వేళాంగి ణి మాత ఎన్‌క్లేవ్ అపార్టుమెంట్లో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. గమనించిన వాచ్‌మన్ పెద్దగా కేకలు వేయడంతో అపార్టు మెంట్ వాసులు బయటకు వచ్చారు. ఈ ప్రమాదంలో అపార్టుమెంటుకు చెందిన ఏడుగురు ద్విచక్ర వాహనాలు, రెండు సైకిళ్లు దగ్ధమయ్యాయి. ప్రమాదానికి కారణాలను అగ్నిమాపక అధికారులు, నల్లపాడు పోలీసులు విచారిస్తున్నారు. వారిచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. బాధితుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెరియార్ రామస్వామికి ఘన నివాళులు



రామస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గుంటూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెరియార్ రామస్వామి జయంతి కార్యక్రమం అరండల్ పేటలోని 13వ లైన్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భం గా జూపూడి మాట్లాడుతూ పెరియార్ రామస్వామి ఆత్మగౌరవ ఉద్యమాన్ని భారతదేశ వ్యాప్తంగా, ఆధిపత్య సామాజికవర్గాల భావజాలకు వ్యతిరేకంగా ఉద్యమం నడిపి బహుజ నులకు సమానత్వం కావాలని నినదించారన్నారు. పెరియార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దార్ వెంకటేశ్వరరావు, బహుజన్ మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్‌సింగ్, వట్టికూటి సాంబయ్య నూతల పాటి రామారావు, ఉగ్గం సాంబశివరావు తదితరులున్నారు.



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న ఈగల్ టీం ఎస్ఐ సునీల్‌బాబు తదితరులు

మాదకద్రవ్యాలపై యువత అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు(విద్య), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలపై యువత అప్రమ త్తంగా ఉండాలని వీటి వినియోగం వల్ల అనేక నష్టాలు న్నాయని ఈగల్ టీం ఎస్ఐ ఎం సునీల్‌బాబు తెలిపారు బుధవారం అమరావతి రోడ్డులోని హిందూ ఇంజనీరింగ్ కళాశాల లో మాదకద్రవ్యాల వినియోగంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సునీల్‌బాబు మాట్లాడుతూ పూర్తి అవగాహనతో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించవచ్చునని అన్నారు. ఎవరైనా డ్రగ్స్ గంజాయి, కొకైన్ లాంటివి మీ చుట్టుపక్కల వారు విక్రయించినా, వాడుతున్నట్లు తెలిసినా తక్షణమే పోలీస్‌వారికీ లేదా 1972కి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ల మూడి శేఖర్‌బాబు, కళాశాల డైరెక్టర్ పీఎం ప్రసాద్, కార్యదర్శి సీహెచ్ రామకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ సీహెచ్ సుబ్బారావు, వి.నర్సిరెడ్డి, ఎన్ఎస్ ఎస్ కన్వి నర్ కె.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్వస్త్ నారీ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

'స్వస్త్ నారీ'తో ఆడబిడ్డ ఆరోగ్యం మెరుగుదల

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంతో ఆడబిడ్డల ఆరోగ్యం మెరుగుపడుతుందని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. నియోజకవర్గం లోని కేవీపీ కాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్లో బుధవారం ఆమె కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

విశ్వకర్మ జయంతి వేడుకలు

పశ్చిమ నియోజకవర్గం శ్రీనివాసరావుపేటలో విశ్వకర్మ చిత్రపటానికి ఎమ్మె ల్యే గళ్లా మాధవి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

పశ్చిమ నియోజకవర్గం 18వ డివిజన్ రామనామ క్షేత్రం సమీపంలోని భరతమాత విగ్రహం వద్ద భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఎమ్మెల్యే మాధవి ముఖ్యఅతిథిగా హాజర య్యారు. బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాశ్, గుంటూ రు జిల్లా బీజేపీ అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావుతో కలసి కేక్ కట్ చేశారు. కార్యక్రమం టీవీ రావు, చెరకా కుమార్ గౌడ్, నేరేళ్ల మాధవరావు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం

పశ్చిమ కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవి మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పూడికతీత పనులపై అధికారులు నిర్లక్ష్యం వహించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కా రానికి జవాబుదారీగా ఉండాలని హితవు పలికారు.

జ్యోతి కుటుంబంలో వెలుగు రేఖ

● 'ఆంధ్రజ్యోతి 'కథనానికి స్పందించిన ఎమ్మెల్యే నసీర్
● రూ.10 వేలు ఆర్థిక సాయం
● టిడ్కో ఇల్లు మంజూరు చేయిస్తామని హామీ

గుంటూరు సిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అమ్మా..ఆకలి అంటూ బిడ్డ నోరు తెరిచి అడిగితే అన్నం ముద్ద పెట్టలేక, పొంగుకొచ్చే కన్నీళ్ల దాచుకోలేక భిక్షాటన చేస్తున్న అంధురాలు పాములపాటి జ్యోతికి తూర్పు ఎమ్మెల్యే వెలుగు రేఖగా మారారు. 'పాపం జ్యోతి' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురిత మైన కథనానికి ఎమ్మెల్యే నసీర్ స్పందించారు. జ్యోతి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటా నని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే నసీర్ స్వయంగా తమ ఇంటికి రావడంతో జ్యోతి రెండు చేతులు జోడించి కన్నీటి పర్యంతమైంది. అయ్యా.. బిడ్డకు అన్నం కూడా పెట్టుకోలేని దుస్థితిలో ఉన్నానంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ఎమ్మెల్యే నసీర్ వెంటనే రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి అధైర్యపడొద్దంటూ భరో సానిచ్చారు. ప్రభుత్వం తరఫున టిడ్కో ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జ్యోతి కుమారుడి చదువులకు తాను పూర్తి అండగా నిలుస్తానని స్థానిక కార్పొరేటర్ అశోక్ భరోసా కల్పించారు. జ్యోతి కుటుంబ పోషణకు సంబంధించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.



పాములపాటి జ్యోతికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు గుంటూరు నగరంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం బీజేపీ కిసాన్ మోర్చా నేత వీ పాండురంగ విఠల్ నేతృత్వంలో ఇన్నర్ రింగురోడ్డులో మిఠాయిలు పంచిపెట్టి హర్షం వ్యక్తం చేశారు. అలానే బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రధాని జన్మదిన వేడుకలను గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఇన్నర్ రింగురోడ్డులో మిఠాయిలు పంచి పెడుతున్న బీజేపీ నాయకులు

● గుంటూరు మెడికల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతి శక్తివంతమైన నాయకుడు భారత ప్రధాని నరేంద్రమోదీ అని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ల హరి కొనియాడారు. శ్రీనివాసరావుతోటలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బండారు రవీంద్ర, మెహబుబ్ బాషా, మాజీ కార్పొరేటర్ శ్రావణకుమారి, బీజేపీ జిల్లా కార్యదర్శి వీరమణి, మహిళా మోర్చా నాయకురాలు జూపూడి భవాని, టీడీపీ డివిజన్ అధ్యక్షులు చింతకా యల సాయి, కూటమి నేతలు పాల్గొన్నారు.

పశుగ్రాసం వితరణ

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ గుంటూరు ఆధ్వర్యంలో ప్రధాని మోదీ జన్మదిన సందర్భంగా నంబూరులోని శ్రీకాశీ విశ్వనాథ గోసంరక్షణ, గోసంఘానికి రూ.40వేల విలువగల్గిన పశుగ్రాసాన్ని అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ మాట్లాడుతూ మోదీ దూరదృష్టి, కృషితో నేడు భారత్ ప్రపంచంలో విశ్వగురు స్థాయికి చేరుకుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నేరేళ్ల మాధవరావు, సభ్యులు కూనిశెట్టి చంద్రశేఖరరావు, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ కంటే అదనంగా యూరియా

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో యూరియా అవసరం 24 వేల మెట్రిక్ టన్నులు కాగా తమ ప్రభుత్వం అంతకంటే అదనంగా మొత్తం 26 వేల మెట్రిక్ టన్నులను సరఫరా చేసిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ ఎక్కువగా యూరియా అందించినా సమస్యలు ఎందుకు వచ్చాయని పరిశీలిస్తే వర్షాలు అధికంగా పడటం వలన యూరియా కొట్టుకుపోయి వినియోగం పెరిగిందన్నారు. దీనికి తోడు కొన్ని మాధ్యమాల్లో యూరియా కొరత అనే ప్రచారం వల్ల రైతాంగం కంగారుపడి అధిక కొనుగోళ్లు చేయడం కూడా ఒక కారణం అన్నారు. రాబోయే సంవత్సరం అయినా ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా మార్క్‌ఫెడ్ నుంచి అధికంగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కౌలు రైతులు ఎక్కువగా ఉండటం వల్ల వారిలో ఎవరెవరు యూరియా తీసుకుంటున్నారు అనేది తెలియడం లేదు. ఓటీపీ మెకానిజం ద్వారా ఒరిజినల్ కౌలుదారులకు యూరియా అందేలా చర్యలు తీసుకోబోతున్నామన్నారు. ఇప్పటివరకు 13 వేల మట్టి నమూనాలు పరీక్షించామని అధికారులు చెబుతున్నారు. అయితే చాలా చోట్ల సాయిల్ టెస్టులు పూర్తిస్థాయిలో జరగడం లేదు. నూతన సాంకేతిక విధానం ద్వారా సాయిల్ టెస్టులు జరిగేలా చర్యలు తీసుకోబోతున్నామని చెప్పారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా ద్వారా రైతులకు బీమా సౌకర్యం అందించేలా చర్యలు తీసుకోబోతున్నామని తెలిపారు. 90 శాతం మంది రైతులు ఇన్సూరెన్స్‌కు దరఖాస్తు చేయలేకపోతున్నారు. దానికి గల కారణాలపై సమాచారం సేకరిస్తున్నామన్నారు.. త్వరలోనే పరిష్కార మార్గాలు కనుగొని తగు చర్యలు తీసుకుంటాం. సంబంధిత సమస్యలు, ఇబ్బందులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రికి లేఖలు రాసి పరిష్కార మార్గాలు చూపిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, ఎల్‌డీఎం మహిపాల్, డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు, ఉద్యాన శాఖ డీడీ రవీంద్రబాబు రైతు నాయకులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలపై సమీక్ష నిర్వహిస్తోన్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని


విద్యార్థులతో కలిసి సందడి చేస్తున్న మంచు లక్ష్మీప్రసన్న


స్మార్ట్ క్లాస్ రూమ్‌ను ప్రారంభిస్తున్న మంచు లక్ష్మీప్రసన్న, చిత్రంలో ఎమ్మెల్యే ప్రవీణ్

మంచు లక్ష్మీప్రసన్న సేవలు ఆదర్శనీయం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) టీచ్ ఫర్ చేంజ్ పేరుతో సంస్థను స్థాపించి పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను ఏర్పాటుచేస్తూ స్పోకెన్ ఇంగ్లీష్, సృజనాత్మకత పెంపొందించేందుకు కృషి చేస్తున్న మంచు లక్ష్మీ ప్రసన్న అందిస్తున్న సేవలు ఆదర్శనీయం అని పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ అన్నారు. టీచ్ ఫర్ చేంజ్ సహకారంతో మండల పరిధిలోని ధరణికోటలోని ట్రులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమానికి ఎంఈవో-2 శివబాబు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని అమరావతి మండలంలో పది పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ మూడు రాష్ట్రాలలో టీచ్ ఫర్ చేంజ్ ద్వారా పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. తాము మూడు సంవత్సరాలు పర్యవేక్షణచేసి స్థానిక ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి వారికి వదలివేయడం జరుగుతుందన్నారు. తాను నిర్మించిన దక్ష చిత్రం రెండు రోజులలో విడుదల కానున్నా ఇక్కడకు రావడం పిల్లలపై ఉన్న అభిమానమే కారణమన్నారు. పిల్లలతో కలసి సరదాగా నృత్యంచేసి వారితో పాటు, తల్లిదండ్రులు, బోధన సిబ్బందితో ఫొటోలు దిగారు. లక్ష్మీ ప్రసన్నను ఎమ్మెల్యే ప్రవీణ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెగా సిస్టమ్ ఇండియా లీగల్ కౌన్సిల్ సుయోధన్, ఎంపీడీవో పార్వతి, ఎంఈవో కేఎస్ఎన్ ప్రసాద్, శివబాబు, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, బోధనా సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆసియా దేశాల్లో పిన్న వయస్కులకే పక్షవాతం

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): 'అమెరికా, యూరప్ దేశాలతో పోలిస్తే ఆసియా దేశాల్లోనే పక్షవాతం త్వరగా దాడి చేస్తోంది. అమెరికాలో 60, 70 ఏళ్లు పైబడిన వృద్ధుల్లో పక్షవాతం కనిపిస్తుంటే... భారత్ వంటి ఆసియా దేశాల్లో 40వ పడిలోనే పక్షవాతం బారిన పడుతున్నారు' అని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు, న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ విజయ తెలిపారు. జపాన్‌లోని హ్యాగో యూనివర్శిటీలో సెప్టెంబరు 13 నుంచి 15 వరకు జరిగిన ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ ఆసియా పసిఫిక్ స్ట్రోక్ కాన్ఫరెన్స్ (ఏపీ ఎస్‌సీ) 2025లో భారతదేశం నుంచి ఆహ్వానిత స్పీకర్‌గా ఆమె ప్రాతినిధ్యం వహించారు. బుధవారం గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ విజయ ఈ సదస్సు విశేషాలను తెలిపారు. ఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు హోదాలో హాజరైన తాను... సదస్సులో సభ్య దేశాలతో సహకార రౌండ్ టేబుల్ ప్లాట్‌ఫాంకు నాయకత్వం వహించినట్లు తెలిపారు.

పురుషుల కంటే స్త్రీలకే...

'పురుషులతో పోలిస్తే మహిళల్లో పక్షవాతం తీవ్రంగా దాడి చేస్తుంది. వీరిలో ప్రాణ హాని కూడా ఎక్కువగానే ఉంటుంది' అని డాక్టర్ విజయ తెలిపారు. ముందస్తు రుతు చక్రం, హార్మోన్ మందుల వాడకం, గర్భం ధరించడం, పాలిసిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్ (పీసీవోడీ), సెరిబ్రల్ వీనస్ థ్రాంబోసిస్ (సీవీడీ), అధిక రక్తపోటు, ఎండోమెట్రి యాసిస్, మెనోపాజ్ వంటివి ఇందుకు దోహదపడుతున్నట్లు ఆమె వివరించారు. మహిళల్లో పక్షవాతం వల్ల మరణాలు రొమ్ము కేన్సర్ కంటే రెండింతలు అధికంగా ఉంటున్నాయి. ఇటీవల పిల్లలు, ఇరవై ఏళ్లలోపు యువతలో కూడా పక్షవాత మరణాలు సంభవించడం ఆందోళన కలిగిస్తున్నాయి' అని డాక్టర్ విజయ వెల్లడించారు. దీనిపై తాము పరిశోధనలు జరుపుతున్నట్లు ప్రకటించారు.

పురుషుల కంటే స్త్రీలకే ఎక్కువ ప్రాణహాని

రొమ్ము క్యాన్సర్ కన్నా స్ట్రోక్ మరణాలే అధికం



జపాన్‌లో సదస్సు ప్రాంగణంలో ఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ విజయ

16 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



విజయపురిసౌత్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు బుధవారం 16 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 588.00 అడుగులు ఉంది. ఇది 306.10 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500, ఎడమ కాలువ ద్వారా 8,454, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,967, 16 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,26,240 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 1,79,861 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 1,38,805 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పెరుగుతున్న వరద ఉధృతి


ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు ప్రధాన వాగుల నుంచి 2,12,284 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదు అవుతుండగా దిగువకు 1,98,825 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాల్వకు 7,932, పశ్చిమ డెల్టాకు 5,527 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్ కాల్వకు నీటి విడుదల నిలిపివేశారు. వరద ఉధృతి పెరుగుతుండడంతో బ్యారేజి దిగువ ప్రాంతాల్లో ఉన్న నది తీర ప్రాంత వాసులు, లంక భూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 40.95 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 1,27,040 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, నాలుగు గేట్ల ద్వారా 94,448 క్యూసెక్కులు, మొత్తం 1,11,448 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

అంధురాలిపై..రాబంధువుల కుట్ర!

తల్లిదండ్రుల మరణంతో రూ.40 కోట్ల ఆస్తికి ఎసరు

తప్పుడు పత్రాలతో ఆస్తుల రిజిస్ట్రేషన్

సోదరుడి ఫిర్యాదుతో ఆరుగురి అరెస్టు

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల మరణంతో ఒంటరైన కుమార్తె రూ.కోట్ల ఆస్తులపై బంధువుల కళ్లు పడ్డాయి. అంధురాలు, అందులోనూ మానసిక దివ్యాంగురాలనే కనికరం చూపకుండా.. తప్పుడు పత్రాలతో స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చిందంటూ ఆస్తులను విక్రయించారు. బాధితురాలికి వరుసకు సోదరుడయ్యే వ్యక్తి ఫిర్యాదుతో అసలు గుట్టు బయటపడింది. ఇందుకు కారణమైన నిందితులు ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు, ఫిర్యాది వివరాల మేరకు...అరండల్‌పేటకు చెందిన గుంటూరు విశ్రాంత సర్వేయర్ బొల్లేపల్లి వెంకట కోటయ్య, శారద దంపతులకు ఒకే ఒక్క కూతురు ఇందిర. పుట్టుకతోనే ఆమె మానసిక దివ్యాంగురాలు, పూర్తిగా అంధురాలు. కోటయ్య 2013లో మృతి చెందారు. ఆయన భార్య శారదకు గుంటూరు నగరం, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో సుమారు రూ.40 కోట్ల ఆస్తులున్నాయి. ఆమెకు చెల్లెలు రాణి, తమ్ముడు మాధవరావు ఉన్నారు. శారద వృద్ధాప్యంతో అస్వస్థతకు లోనైన సమయంలో కృష్ణాజిల్లా నందిగామ మండలం కమ్మవారిపాలేనికి చెందిన తమ్ముడు చాపలమడుగు మాధవరావు, కుమారుడు ఉమాశంకర్, కోడలు దుర్గ భవాని రంగంలోకి దిగారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న శారదను నిర్బంధించి ఇంటిలో ఉన్న ఆస్తుల దస్తావేజులను, రెండు కిలోల బంగారు ఆభరణాలు, 6 కిలోల వెండి వస్తువులతో పాటు సుమారు రూ.70 లక్షల నగదును వారు బలవంతంగా తీసుకెళ్లారని శారద చెల్లెలు రాణి కుమారుడు పరుచూరి విష్ణువర్ధన్ రావు అరండల్ పేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు గత మే నెలలో కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో మాధవరావు, కుమారుడు ఉమాశంకర్‌తో పాటు.. పలువురు బంధువులు, ఇంటిలో పని పనివాళ్లు, స్నేహితుల పేరుతో ఇందిర నుంచి స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ తీసుకొని దాని ద్వారా పెద్ద ఎత్తున ఆస్తులు విక్రయించినట్లు తేలింది. ఈ కేసులో మాధవరావు, కొడుకు ఉమాశంకర్, కోడలు దుర్గా భవాని, వియ్యంకురాలు పి.వెంకట్రావమ్మ, మాధవరావు ఇంటిలో పనిమనిషి పి.శౌరి, నిమ్మగడ్డ గ్రామానికి చెందిన కొర్రపాటి నారాయణ, గౌరవరం గ్రామానికి చెందిన పరిమి సుబ్బారావు, కమ్మవారిపాలేనికి చెందిన కొర్రపాటిరాణి, నగరంలోని హిమనినగర్‌కు చెందిన ఉమాశంకర్ డ్రైవర్ బొప్పూడి నాగరాజును నిందితులుగా చేర్చారు. ఇంతకు ముందే వెంకట్రావమ్మ, శౌరి, కొర్రపాటి నారాయణ, పరిమి సుబ్బారావు అరెస్టు చేశారు. రెండు రోజుల క్రితం ఉమాశంకర్, భార్య దుర్గ భవానీని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మాధవరావు, కొర్రపాటి రాణి, బొప్పూడి నాగరాజు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

దస్తావేజులను రద్దు చేయాలి

నకిలీ దస్తావేజులు సృష్టించి అక్రమంగా విక్రయాలు జరపడానికి కారణమైన రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు పరుచూరి విష్ణువర్ధన్ రావు కోరారు. దస్తావేజులను సీజ్ చేసి, చట్ట ప్రకారం వాటిని రద్దు చేయించాలన్నారు. నల్లపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే గుంటూరులోని ఆస్తుల రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. కృష్ణాజిల్లాలోని వత్సవాయి తహసీల్దారుకు తాను నోటీసు ఇచ్చినప్పటికీ ఇందిర పేరుతో పాసు పుస్తకాలు ఇచ్చారని, ఆమె దరఖాస్తు చేయలేదని చెప్పినప్పటికీ వినిపించుకోలేదని చెప్పారు. వాటిని ఉమాశంకర్ వేరే వారికి విక్రయించాడన్నారు. ఇందిర ఉమాశంకర్ కూతుర్ని దత్తత తీసుకున్నట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించి ఆస్తులు కొట్టేసారని విమర్శించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఆమె స్పెషల్ పవర్ ఇచ్చినట్లు పత్రాలు సృష్టించి ఆస్తులను కొట్టేశారన్నారు. ఇందిర గార్డియన్ వ్యవహారంపై కూడా చర్యలు చేపట్టాలని, నిర్బంధంలో ఉన్న ఇందిరను విడిపించాలని కోరారు.

రైల్వేలో విస్తృతంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు

● డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవ - 2025లో భాగంగా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు డీఆర్ఎం సుదేష్ణ సేన్ తెలిపారు. బుధవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో 15 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను వెల్లడించారు. తొలుత రైల్వే అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రైల్‌వికాస్ భవన్ ప్రాంగణంలో జరిగిన శ్రమదానంలో పాల్గొని చెత్త, చెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిత్యం జరుగుతాయన్నారు. పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, టాయ్‌లెట్స్‌ని శుభ్రంగా ఉంచుకోవడం, ఆరోగ్య శిబిరాలు, మారథాన్/వాకథాన్, మొక్కలు నాటే కార్యక్రమాలు వంటివి పెద్దఎత్తున నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం రమేష్‌కుమార్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎంలు కమలాకర్‌బాబు, డి.వినయ్‌కాంత్ పాల్గొన్నారు.


రైల్వే అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

సమర్థంగా సేవలు అందించండి

ఎస్పీకి స్పీకర్ అయ్యన్న పాత్రుడు సూచన

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన, సమర్థంగా సేవలు అందించడం ద్వారా పోలీస్ ప్రతిష్ఠ పెంచాలని ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. బుధవారం అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో అయ్యన్నపాత్రుడిని ఎస్పీ వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జిందాల్‌కు పోలీస్ శాఖ ప్రతిష్ఠను పెంచేలా పనిచేయాలని ఆయన సూచించారు.

బందోబస్తుపై సమీక్ష..

అసెంబ్లీ సమావేశాల బందోబస్తు విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతో సమన్వంతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. బుధవారం ఆయన తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లో అధికారులకు పలు సూచనలు చేశారు. గురువారం నుంచి అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో హాజరయ్యే ప్రముఖులతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ విధి నిర్వహణలో దృఢంగా వ్యవహరించాలన్నారు. సచివాలయానికి వీవీఐపీ, వీఐపీలు వచ్చే మార్గాలను ముందుగానే క్లియర్ చేసి, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అసెంబ్లీ సమావేశ మందిరానికి వీవీఐపీ, వీఐపీలు, మీడియా వారు, సందర్శకులు వెళ్లేందుకు ఉన్న అన్ని గేట్లలో డీఎస్పీస్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించడం జరిగిందన్నారు. బాడీ ఓర్ కెమెరాలు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రమణ మూర్తి, రవికుమార్, హనుమంతు,డీఎస్పీలు,సీఐలు,ఎస్సైలు పాల్గొన్నారు.


అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని మర్యాదపూర్వకంగా కలసిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

ఆర్యవైశ్య సంఘ భవనం అక్రమ రిజిస్ట్రేషన్

● బ్యాంకు రుణానికి వెళ్లడంతో వెలుగు చూసిన వైనం

యడ్లపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు ఆర్యవైశ్య సంఘం భవనాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. సంఘం ఉపకోశాధికారిగా వ్యవహరించిన వ్యక్తే రిజిస్ట్రేషన్ చేయించుకోవడం సంఘ సభ్యులను ఆశ్చర్యానికి గురిచేసింది. సంఘ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. '1925లో గ్రామానికి చెందిన ధూమాళరావు బుచ్చన్న పంతులు, హనుమాయమ్మ లైబ్రరీ సెంటర్‌లోని 4 సెంట్ల విస్తీర్ణంలోని భవనాన్ని ఆర్యవైశ్య సంఘానికి దానంగా ఇచ్చారు. దానికి అనుబంధంగా ప్రపత్తి ఆంజనేయస్వామి దేవాలయం కూడా ఉంది. ఆ భవనాన్ని అద్దెకు ఇస్తూ దానిపై వచ్చే అద్దెలతో ఆలయ నిర్వహణ చేసేవారు. శిథిలావస్థకు చేరడంతో ఆలయాన్ని, భవనాన్ని 2011లో కూల్చి వేశారు. నూతన భవనాన్ని నిర్మించే సమయంలో గ్రామంలోని ఆర్యవైశ్యలంతా కలసి పాత కమిటీని రద్దు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామానికి చెందిన బాలనాగు సత్యన్నారాయణ అధ్యక్షుడిగా మరో ఆరుగురు సభ్యులను కమిటీగా ఎన్నుకున్నారు. మద్దుల రమణారావు ఉప కోశాధికారిగా కమిటీలో క్రియాశీలకంగా వ్యవహరించడంతో.. అధ్యక్షుడితో సహా మిగిలిన వారంతా రమణారావుకే బాధ్యతలను అప్పగించారు. 2016లో ఆలయం, భవన నిర్మాణం పూర్తి చేశారు. పంచాయతీలో పన్ను నమోదు సమయంలో భవన యజమానిగా రమణారావు తన పేరును నమోదు చేయించుకున్నాడు. తన పేరుతో చిలకలూరిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. 2024లో భార్య శిరీష పేరుతో సదరు భవనాన్ని గిఫ్ట్‌డీడ్ చేయించాడు. ఇటీవల ఆ భవనంపై రుణం తీసుకునేందుకు నరసరావుపేటలోని ఓ బ్యాంకులో దరఖాస్తు చేశారు. బ్యాంకు సిబ్బంది భవనం కొలతలు తీసుకునేందుకు మంగళవారం గ్రామానికి వచ్చారు. భవనం కొలతలు తీస్తుండగా స్థానిక ఆర్యవైశ్యులు వారిని ప్రశ్నించారు. రమణారావు రుణం కోసం తన భార్య పేరుతో దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. దీనితో ఆర్యవైశ్యులు, మిగిలిన కమిటీ సభ్యులు రమణారావును నిలదీయగా అది తనదేనని, మీ వద్ద ఏమైనా డాక్యుమెంట్లు ఉంటే చూపించండి అంటూ దురుసుగా ప్రవర్తించాడు. దీనితో ఆర్యవైశ్య సంఘ సభ్యులంతా కలసి విచారించగా భవనాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు నిర్ధారించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి శశికళకు వినతిపత్రం అందజేశారు. భవనానికి సంబంధించిన ఆధారాలు ఏవైనా ఇస్తే రికార్డులు సరిచేయడంతోపాటు రిజిస్ట్రేషన్ రద్దుకు సబ్ రిజిస్ట్రారుకు సిఫార్సు చేస్తామని పంచాయతీ కార్యదర్శి వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో సంఘం అధ్యక్షులు సత్యన్నారాయణ, జాయింట్ సెక్రటరి కోటేశ్వరరావు, కోశాధికారి శ్రీనివాసరావు, ఆర్యవైశ్యులు ఉన్నారు.


ఉప కోశాధికారి రమణారావు రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఆర్యవైశ్య సంఘ భవనం

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

వక్తృత్వ పోటీలలో కాకుమాను విద్యార్థిని ప్రతిభ


శాశ్వత

కాకుమాను, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొల్లా వెంకయ్య వర్థంతి సందర్భంగా కొల్లా వెంకయ్య లైబ్రరీలో బుధవారం నిర్వహించిన పోటీలలో కాకుమాను జడ్పీహెచ్ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని బొనిగల శాశ్వత వ్యాసరచనలో మొదటి బహుమతి పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీశ్రీ గేయాలు, క్విజ్ పోటీలలో వరుసగా రెండు, మూడో బహుమతి అందికుంది. అలాగే 8వ తరగతి విద్యార్థిని ప్రవస్తి వక్తృత్వంలో రెండో బహుమతి అందుకుంది. 9వ తరగతి విద్యార్థి అన్సర్ అలీ వ్యాస రచనలో 3వ స్థానంలో నిలిచాడు.


జగపతిబాబు మృతదేహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

జగపతిబాబు కుటుంబానికి పరామర్శ

మేడికొండూరు సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామానికి చెందిన యువ వైద్యుడు చాగంటిపాటి జగపతిబాబు మృతదేహాన్ని బుధవారం పేరేచర్లకు తీసుకువచ్చారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రుషికేశ్ ఎయిమ్స్ ఆస్పత్రిలో స్పెషలైజేషన్ చేస్తున్న జగపతిబాబు ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. జగపతిబాబు మృతదేహాన్ని మాజీ జడ్పీటీసీ గుంటుపల్లి సాంబశివరావు, పేరేచర్ల మాజీ సర్పంచ్ గడ్డం రాంబాబు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పాములపాటి శ్రీనివాస్ సందర్శించి నివాళి అర్పించారు.

క్లుప్తంగా...

● మంగళగిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌ల మాయాజాలానికి వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీన మంగళగిరి అంబేడ్కర్ సెంటరులో నిరసన తెలియజేయనున్నట్టు కమ్యూనిస్ట్ ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమల్లేశ్వరరావు తెలిపారు. బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు, వారికి కొమ్ము కాసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

● తుళ్లూరు: బాలుడి దగ్గర నుంచి ఇద్దరు యువకులు టీవీఎస్ మోపెడ్‌ను లాక్కుపోయేందుకు మండల కేంద్రం తుళ్లూరులో మంగళవారం రాత్రి జరిగింది. దీనిపై పోలీసులు సీసీ పుటేజీని పరిశీలిస్తున్నారు.

● తాడేపల్లి (వడ్డేశ్వరం): పారిశుధ్య కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం జీతాలివ్వాలని సీపీఎం మండల మాజీ కార్యదర్శి, సీఐటీయూ నేత దొంతిరెడ్డి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వడ్డేశ్వరం, ఇప్పటం గ్రామాలలో పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు.

● తాడికొండ (నిడుముక్కల): రెండో విడత ల్యాండ్ పూలింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆంధ్ర రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. తాడికొండ మండలం నిడుముక్కలలో జరుగుతున్న రిలే దీక్షలు బుధవారానికి 80వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

● మంగళగిరి: తిరుపతిలో యాత్రికుల సౌకర్యార్థం అన్ని వసతులతో నిర్మించిన శ్రీ శ్రీనివాస ఉమా రామలింగేశ్వర నిత్యాన్నదాన దేవాంగ సత్రంను అక్టోబరు 4వ తేదీన ప్రారంభించనున్నట్లు సత్రం అధ్యక్షుడు బొమ్మన దుర్గాప్రసాద్ తెలిపారు. ఈమేరకు సంఘం సమావేశం బల్లా వెంకట రమణ అధ్యక్షతన బుధవారం మంగళగిరిలో బుధవారం జరిగింది.

● పెదనందిపాడు: ప్రభుత్వం సచివాలయ సిబ్బంది సమస్యలు తక్షణమే పరిష్కారించాలని కోరుతూ రాష్ట్ర విలేజ్ వార్డు సెక్రటేరియట్ ఉద్యోగులు సంఘ పిలుపు మేరకు సచివాలయ సిబ్బంది బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కారసాల కుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, ఫాతిమా మహిత, ఉషాంజలి, ఎస్‌కే భాషా, తదితరులు పాల్గొన్నారు.

● మంగళగిరి సిటీ: మంగళగిరిలో ఈ-క్రాప్ బుకింగ్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. మంగళగిరి మండలం కాజ గ్రామంలో వ్యవసాయ క్షేత్రాలను బుధవారం ఆయన సందర్శించారు. కార్యక్రమంలో మండల తహసీల్దారు దినేష్ రాఘవేంద్ర, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, మంగళగిరి వ్యవసాయ అధికారిణి శైలజారాణి, రెవెన్యూ, ఆర్ఎస్‌కే సహాయకులు పాల్గొన్నారు.

● మంగళగిరి సిటీ: చేనేత ఆసు యంత్రం ఆవిష్కర్త, పద్మశ్రీ చింతకింది మల్లేశం బుధవారం ఉదయం మంగళగిరి ఆటోనగర్‌లోని వీవర్‌శాలను సందర్శించారు. అక్కడున్న చేనేత కార్మికులు, వీవర్‌శాల ప్రతినిధులతో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్ జగ్గారపు శ్రీనివాసరావు, పద్మశాలి సంఘం రాష్ట్ర కోకన్వీనర్ డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు, పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకోటి అంజిబాబు పాల్గొన్నారు.

● మేడికొండూరు: మండల పరిషత్ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ప్రధానంగా మైనింగ్ శాఖ అధికారులు గతంలోనూ సమావేశాలకు హాజరు కాకపోవడంపై బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

● పెదనందిపాడు: కొల్లా వెంకయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హిందూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సీఎస్సార్ ప్రసాద్ అన్నారు. మాజీ ఎంపీ, ఎమ్మెల్యే కొల్లా వెంకయ్య 27వ వర్ధంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. గత వారం రోజులగా విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. తొలుత గ్రంథాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి వెంకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మహిళలకు వరం స్వస్త్ నారీ సశక్త్ పరివార్

రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ

మంగళగిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ పథకం మహిళలకు గొప్ప వరమని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలోని యూపీహెచ్‌సీలో బుధవారం స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆదోని ఎమ్మెల్యే బీకే పార్థసారథితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మహిళలకు పోషకాహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, బీజేపీ స్టేట్ మీడియా కన్వీనర్ పాతూరి నాగభూషణం, నేతలు మాదల రమేష్‌బాబు, అన్నే చంద్రశేఖర్, అమ్మయ్య చౌదరి పాల్గొన్నారు.

● దుగ్గిరాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యం కోసం ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. దుగ్గిరాలలోని బీపీ కల్యాణ మండపంలో వైద్య పరీక్షా శిబిరాన్ని ఎంపీపీ జబీన్ కూటమి నాయకులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని 75వేల శిబిరాలను దేశవ్యాప్తంగా స్వస్త్ నారీ సశక్త్ అభియాన్ పేరిట నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షురాలు శ్రీఅనిత, యార్డు చైర్‌పర్సన్ వి.ఝాన్సీరాణి, మాజీ ఎంపీపీ షేక్ జబీన్, యార్డు డైరెక్టర్ కొంగర జోగేంద్రప్రసాద్, జనసేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుండూరు ఉమామహేశ్వరరావు, మండల బీజేపీ అధ్యక్షుడు వెంకట్రావు, డాక్టర్ ఇందిర, అబ్దుల్‌రహ్మాన్, తదితరులు పాల్గొన్నారు. ఈమని పీహెచ్‌సీలో శిబిరాన్ని మండల ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయిచైతన్య ప్రారంభించారు. డాక్టర్ శ్రీవల్లి పలువురు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● తాడికొండ (మోతడక): మహిళల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయని మోతడక ఉపసర్పంచ్ కంకణాల సీతారామయ్య పేర్కొన్నారు. బుధవారం తాడికొండ మండలం మోతడక గ్రామంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పొన్నెకల్లు పీహెచ్‌సీ డాక్టర్ షేక్ సాహిన్ సుల్తానా, ఎంపీటీసీ కంచర్ల సాంబశివరావు, పొన్నెకల్లు సొసైటీ అధ్యక్షుడు ఉప్పుటూరి వెంకటేశ్వరరావు, సెక్రటరీ అనిల్‌కుమార్, ఆయుష్ డాక్టర్ షేక్ రేష్మా, హెల్త్ ఎడ్యుకేటర్ కే.పద్మావతి, హెచ్‌వీ శివకుమారి సూపర్‌వైజర్ ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● కాకుమాను: సమాజంలో జీవన ప్రమాణాలు పెరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కాకుమాను సెక్టార్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఫిరంగిపురం: దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా స్వస్థ నారీ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం కింద బుధవారం నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని మండల వైద్యాధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ యానిగ్రేస్, డాక్టర్ సబీనా బేగం, హెల్త్ సూపర్‌వైజర్ కొండపల్లి సుదర్శనరాజు, గ్రామ సర్పంచ్ నాగమల్లేశ్వరి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● పెదనందిపాడు: మండల పరిధిలోని అబ్బినేనిగుంటపాలెంలో బుధవారం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నందకుమార్, సీహెచ్‌వో ఎస్ఆర్ ప్రసాద్ స్వామి, హెచ్‌సీ సుప్రజ, ఎంపీహెచ్, తదితరులు పాల్గొన్నారు.

యార్డులో డ్రెయినేజి సమస్యను పరిష్కరించాలి

● చైర్‌పర్సన్ ఝాన్సీరాణి
● పరిశీలించిన మార్కెటింగ్ డీఈ


దుగ్గిరాల మార్కెట్ యార్డు చైర్మన్ చాంబర్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు, మార్కెట్ యార్డు పరిసరాలను పరిశీలిస్తున్న మార్కెటింగ్ డీఈ నారాయణ, చైర్‌పర్సన్ ఝాన్సీ, కూటమి నాయకులు

దుగ్గిరాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణ కొద్దిపాటి వర్షానికే జలమయమవుతోందని, సమస్యను పరిష్కరించాలని చైర్‌పర్సన్ ఉన్నం ఝాన్సీరాణి మార్కెటింగ్ శాఖ అధికారులను కోరారు. ఆగస్టు 15న కురిసిన భారీవర్షం కారణంగా యార్డు ఆవరణ మొత్తం జలమయమై రెండోరోజు వరకూ నీరు తొలగిపోలేదు. మురుగునీటితో కలిసిన వర్షపు నీరు చైర్మన్ చాంబర్ ఆవరణలోకి చేరి దుర్గంధం వెదజల్లుతోందని, రైతులు ఫిర్యాదుచేశారు. కాగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు వర్షపునీరు బయటకుపోయే పరిస్థితిలేక పోవడం, విషకీటకాలు ఆవరణలోకి వస్తున్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో యార్డుకు వచ్చిన మార్కెటింగ్‌శాఖ డీఈ ఐ.నారాయణకు యార్డుచుట్టూ పూడిపోయిన, ఆక్రమణకు గురైన డ్రెయిన్‌ను చూపారు. డ్రెయిన్ నీటిపారుదలశాఖ స్థలంలో కొంత, పంచాయతీ స్థలంలో కొంత ఉందని గుర్తించారు. ఆయా శాఖలకు చైర్మన్ లేఖ రాసి సమస్యను పరిష్కరించుకునేందుకు స్థానిక నాయకులతో కలిసి చర్చించారు. యార్డు డైరెక్టర్ కొంగర జోగేంద్రప్రసాద్, ఎంపీపీ షేక్ జబీన్, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, మండల టీడీపీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, దేవరపల్లి చంటి, యార్డు ప్రత్యేకశ్రేణి కార్యదర్శి జేవీ సుబ్బారావు పాల్గొన్నారు.

లోపాలను అధిగమించాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు లోపాలను అధిగమించి లక్ష్యాలను సాధించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులకు అవసరమైన పరికరాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అలమ్‌కో ద్వారా అందించిన పరికరాలను 41 మంది దివ్యాంగులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కాసు పెంటారెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు మీడియా కో ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పొనకల సుబ్రమణ్యం, సూపరింటెండ్ డాక్టర్ ప్రవీణ్, మండల ఆరోగ్యాధికారి డాక్టర్ మేరి యూనిస్, ప్రత్తిపాడు వైద్య సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ నాయకుల చేరిక

పెదనందిపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావిపాడుకు చెందిన 20 కుటుంబాలకు చెందిన వైసీపీ వారు గుంటూరులోని ఎమ్మెల్యే బూర్ల పార్టీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. ఎమెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, రావి శివరామకృష్ణయ్య, కోడూరి రాంబాబు, రామినేని శ్రీనివాసరావు, దివి నాగరాజు, కోటపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎన్నారై అడ్మినిస్ట్రేటర్ విష్ణువర్ధన్‌రావు తదితరులు

రోగి సంరక్షణలో బాధ్యతగా వ్యవహరించాలి

● ఎన్నారై అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్‌రావు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోగి ఆరోగ్యం, సంరక్షణలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని ఎన్నారై వైద్య విద్యా సంస్థల అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్‌రావు సూచించారు. ప్రపంచ రోగి భద్రతా వారోత్సవాలను చినకాకాని ఎన్నారై ఆసుపత్రిలో బుధవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు రోగి భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల డీన్ డాక్టర్ లక్ష్మీ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రబోధ్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కుమార్ చౌదరి, క్వాలిటీ కంట్రోల్ విభాగం అధిపతి డాక్టర్ కాంతకుమారి, సేఫ్టీ ఆఫీసర్ డాక్టర్ అమిత్‌కుమార్, డాక్టర్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఔషధాలపై చలపతి విద్యార్థుల అవగాహన ర్యాలీ


నిడుముక్కలలో ర్యాలీలో పాల్గొన్న మోతడక చలపతి ఫార్మసీ, ఇంజనీరింగ్ విద్యార్థులు

తాడికొండ (నిడుముక్కల) సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఔషధాలను మితంగా వినియోగించినప్పుడే ఆరోగ్యం సక్రమంగా ఉంటుందని ప్రిన్సిపాల్ నల్లాని వెంకట రామారావు పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ రోగి భద్రత దినోత్సవం సందర్భంగా తాడికొండ మండలం నిడుముక్కలలో మోతడక చలపతి ఫార్మసీ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఔషధాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కాల పరిమితి దాటిన ఔషధాలను వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారి, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం అధికారులు పద్మావతి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ ఆసియా సుల్తాన్, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడటం అభినందనీయం

● కిట్స్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు


కిట్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజానికి ఉపయోగపడేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించటం అభినందనీయమని కిట్స్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు అన్నారు. ఇంజనంపాడు గ్రామ సమీపంలోని కిట్స్ కళాశాలలో బుధవారం స్మార్ట్ ఇండియా హాకథాన్ - 2025, అంతర్గత హాకథాన్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 165 జట్లు పాల్గొని వివిధ రంగాల్లోని 18 థీమ్‌లు, 135 సమస్యా ప్రకటనలపై తమ ప్రతిభను ప్రదర్శించారు. కీలక రంగాల్లో విద్యార్థులు విభిన్న ఆలోచనలతో రూపొందించటంపై హర్షం వ్యక్తం చేశారు. కళాశాల సెక్రటరీ కోయ శేఖర్ ఈ హాకథాన్ విద్యార్థులకు కేవలం సాంకేతిక ప్రతిభను మాత్రమే కాకుండా జట్టు పని తీరు, సమస్య పరిష్కారాల నైపుణ్యానికి కొత్త ఆలోచనలతో ముందుకు సాగే ధైర్యాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పీ బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కే హరిబాబు, స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ అరుణ విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సచ్ఛత హీ సేవ ర్యాలీ



స్వచ్ఛత హీ సేవ ర్యాలీని ప్రారంభిస్తున్న భూలక్ష్మి, పాల్గొన్న అధికారులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎయిమ్స్ రోడ్డు ఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి ఎంటీఎంసీ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, అడిషనల్ కమిషనర్ కే.శకుంతల, అసిస్టెంట్ కమిషనరు పట్నూరి శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్, డి. రాజు, ఎంటీఎంసీ సిబ్బంది, అంగన్‌వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


ఊరేగిస్తున్న స్వామివారి జెండా

పెదనందిపాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి దేవస్థానం వద్ద విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి అర్చకులు పవన్‌కుమార్ విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి జెండాను ట్రాక్టర్ పై గ్రామ పుర వీధులలో ఊరేగించారు.

● మంగళగిరి సిటీ: శ్రీ లక్ష్మీనరసింహ స్వర్ణకార సంఘం, లక్ష్మీ నరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ స్వర్ణకార వృత్తిదారులైన దామర్ల రామలక్ష్మణరావు, జంజనం సాంబశివరావు, తిరువీధుల కోదండ రామయ్య, కొడాలి కోటేశ్వరరావు, వెనిగళ్ల వసంతరావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పద్మశ్రీ చింతకింది మల్లేశం, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున, జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పారేపల్లి మహేశ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పడవల మహేశ్, నేతలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదినం

దుగ్గిరాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం దుగ్గిరాల రైలుపేటలోని శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ప్రధాని మోదీ 75వ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకులు ఆలయ ఆవరణను శుభ్రంచేశారు. అనంతరం దుగ్గిరాలలోని పంచాయతీ పారిశుధ్య సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. ● ప్రత్తిపాడు: మోదీ పుట్టిన రోజు సందర్భంగా సీహెచ్‌సీలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ● కాకుమాను: కాకుమానులో బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖుద్దూస్, జిల్లా పార్టీ నాయకులు శ్రీధర్, మండల నాయకులు రాంగోపాల్, తదితరులు మోదీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ● తాడేపల్లి (చిర్రావూరు): మండలంలోని చిర్రావూరులో బీజేపీ పూర్వ మండల అధ్యక్షుడు మక్కపాటి జనార్థన్ నేతృత్వంలో కూటమి నాయకులతో కలిసి మోదీ జన్మదినం ఘనంగా నిర్వహించారు.● మంగళగిరి: ప్రధాన నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో బీజేపీ నాయకులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. స్వచ్ఛ భార

రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు వడ్డేశ్వరం బాలిక ఎంపిక


సీహెచ్ నవీన

తాడేపల్లి (వడ్డేశ్వరం), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా ముత్తాయపాలెం జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జరిగిన బీచ్ వాలీబాల్ పోటీల ఎంపికల్లో తాడేపల్లి మండలం వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని సీహెచ్ నవీన అండర్ 14 బాలికల పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్టు వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కాకుమాను జోజప్ప తెలిపారు. ఎంపికైన నవీనను పాఠశాల పీడీలు మెల్లెంపూడి రవి, నూతక్కి రవి, పాఠశాల సిబ్బంది గ్రామస్థులు అభినందించారు.

ఆరుగురు గంజాయి విక్రేతల అరెస్టు

గుంటూరు, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంగళాయపాలెం టిడ్కో ఇళ్ల వద్ద ఆరుగురు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్టు చేశారు. టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న చొప్పవరపు ప్రవీణ్, వెంగళాయపాలెంకు చెందిన చీలి వెంకటేష్, వెంగళాయపాలెంలో ఉంటున్న బాపట్లకు చెందిన చుక్క ఆనంద్‌బాబు, చల్లావారి పాలెంకు చెందిన జల్లెడ సాయి శ్రీనివాసరావు, కొబాల్డుపేట రెండో లైన్‌కు చెందిన మేక అజయ్ కుమార్‌లను అరెస్టు చేశారు. నల్లపాడు సీఐ వంశీధర్‌కు అందిన సమాచారంతో పోలీసులు వెంగళాయపాలెం టిడ్కో నివాసాల వద్ద తనిఖీలు నిర్వహించగా ఆరుగురు యువకులు పట్టుపడ్డారు వారి వద్ద నుంచి సుమారు 1230 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తాము గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు నిందితులు వెల్లడించారు. దీంతో పోలీసులు వారిని లోతుగా విచారిస్తున్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

వరి పైరులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



ప్రచారం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వరి పైరులో సమగ్ర సస్యరక్షణ చర్యలు అవలంబించాలని వ్యవసాయ విస్తరణ అధికారి ఐ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని దండమూడి, మునిపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ నెలాఖరులోపు రైతులు పంట నమోదు ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శాంతి కల్యాణం

పొన్నూరుటౌన్, సెప్టెంబరు17(ంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ సాక్షి భావనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారి శాంతి కల్యాణం బుధవారం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఆలయంలో కల్యాణ మహోత్సవ సందర్భంగా శ్రీసుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత సాక్షి భవనారాయణ స్వామి ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. శాంతి కల్యాణం అనంతరం ఊంజల్ సేవ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గోవర్ధనం రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఉంజల్ సేవను వీక్షించేందుకు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అంగలకుదురు విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తెనాలి క్రైం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అంగలకుదురు వీఎస్ఆర్ అండ్ జేవీఎం జడ్పీ హైస్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం నాగార్జున యూనివర్సిటీలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో కిలోమీటరు పరుగులో ఆంజనేయులు, 600 మీటర్లలో కరుణ, 400 మీటర్ల విభాగంలో ప్రశాంతి, 600 మీటర్ల విభాగంలో ఎం.అఖిల్ విజేతలుగా నిలిచారు. ఈ నెల 27 నుండి 29 వరకు ఏలూరు జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. వీరిని హెచ్‌ఎం ఎన్.అనురాధ, వ్యాయామ ఉపాధ్యాయులు వేమూరి శరత్‌బాబు, పులివర్తి రాజు అభినందించారు.

రాష్ట్రస్థాయి బీచ్‌వాలీబాల్ పోటీలకు వేజండ్ల విద్యార్థుల ఎంపిక



క్రీడా కారులతో హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు

చేబ్రోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా ముత్తాయిపాలెంలో ఈనెల 16న ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-14 బాల బాలికల బీచ్ వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో మండలంలోని వేజండ్ల జడ్పీ హైస్కూలుకు చెందిన 9వ తరగతి విద్యార్థులు యంపరాల నందిని, జోగిపర్తి నాగుర్‌బి ప్రతిభను కనబరిచి అక్టోబర్‌లో బాపట్లలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని పీఈటీ తిరుమలశెట్టి వెంకటేశ్వరావు, పీడీ దాసరి విజయదుర్గ అన్నారు. వీరిని హెచ్‌ఎం కె.గౌరీశ్వరీ దేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రవ్యాప్తంగా యూటీఎఫ్ రణభేరి

చేబ్రోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుండి 19వ తేదీ వరకు రణభేరీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ సభ్యులు తెలిపారు. ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలు, పాఠశాలల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా రణభేరి కార్యక్రమాన్ని యూ టీఎఫ్ ప్రారంభించనుంది. అందులో భాగంగా ఈ నెల 19న చేబ్రోలు మండలంలో రాష్ట్రవ్యాప్త జాత కార్యక్రమం జరుగనుందని తెలిపారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలపై ప్రభుత్వానికి తెలిపినా కనీసం కమిటీ కూడా వేయకుండా ఉద్యోగులను మోసం చేస్తున్నారన్నారు. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉపాధ్యాయుల బకాయిలు వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ చెల్లించకుండా మనోవేదనకు గురి చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా మూల్యాంకనం పేరుతో ఎన్నడు లేనివిధంగా అమలు చేస్తున్న మూల్యాంకన పుస్తకాలు మరింత భారంగా మారాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని కోరారు. ప్రభుత్వం స్పందిచకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా చేబ్రోలు మండల యూటీఎఫ్ కార్యాలయంలో రణభేరీ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని మండల నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఈ పార్థసారథి, మండల సహాధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, కోశాధికారి కె.శ్రీనివాసరావు, మండల నాయకులు శివకోటేశ్వరావు పాల్గొన్నారు.

తపాలా శాఖ లక్ష్యాలను సాధించాలి

● పోస్టల్ జనరల్ మేనేజర్ మూర్తి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ లక్ష్యాలను సాధించేందుకు సిబ్బంది కృషిచేయాలని విజయవాడ పోస్టుమాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి చెప్పారు. స్థానిక కొత్తపేటలోని డివిజనల్ కార్యాలయాన్ని హెడ్ పోస్టు ఆఫీసును బుధవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఉద్యోగులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ, పోస్టల్ శాఖ నిర్వహిస్తున్న పథకాలన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పోస్టల్ ఇన్సూరెన్స్ పథకం అన్ని బీమా కంపెనీల కన్నా ఎక్కువ బోనస్ అందిస్తుందన్న విషయాన్ని అందరికి తెలపాలన్నారు. డివిజనల్ సూపరింటెండెంట్ బాలసరస్వతి పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబానికి వెలుగు

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



కొల్లిపర: మున్నంగి మెడికల్ క్యాంపులో రక్త పరీక్షా విధానాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

కొల్లిపర, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళా ఆరోగ్యమే కుటుంబానికి వెలుగని.. మహిళా ఆరోగ్యం.. జాతీయ ఆరోగ్యం అనే ఆలోచనతో స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రవేశపెట్టారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం మున్నంగి పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి తహసీల్దార్ సిద్ధార్థ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ దేశ స్థితిగతులు మార్చిన వ్యక్తి ప్రధానమంత్రి అన్నారు. ప్రస్తుత కాలంలో ఎక్కువ మందికి బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నట్లు తెలిపారు. గతంలో రాష్ట్రంలో క్యాన్సర్ హాస్పటల్స్ రెండు మాత్రమే ఉండేవి అని ఇప్పుడు జిల్లాకు ఒక క్యాన్సర్ హాస్పటల్ రాబోతుందన్నారు. కలుషితమైన వాతావరణంలో మనం ఉంటే ఇటువంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో మున్నంగిలో పీహెచ్‌సీని, కొల్లిపరలో 30పడకల హాస్పటల్‌ను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. తెనాలి నియోజకవర్గంలోని ప్రభుత్వ హాస్పటల్స్‌లో వచ్చే నాలుగైదు నెలల్లో మరిన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. మహిళలకు పౌష్టికాహారం అందించడంలో రాజీపడటంలేదన్నారు. కొల్లిపర మండలం గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రథమస్థానంలో ఉండేదని మరలా కూటమి పాలనలో ప్రథమ స్థానంలో నిలపనున్నట్లు హామీ ఇచ్చారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి, వైద్యాధికారులు సుబ్బారావు, నీహ, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి.. ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం

అభివృద్ధి.. ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం మండలంలోని కుంచవరం, దంతలూరు గ్రామాల్లో రూ.64లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవన నిర్మాణాలకు కూటమి నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోనే కొల్లిపర మండలాన్ని అభివృద్ధిపథంలో ముందంజలో ఉంచటానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం వల్లభాపురంలో పేరంటాళ్లమ్మ ఆలయం వద్ద రూ.10లక్షల నిధులతో నిర్మించనున్న సీసీరోడ్డుకి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్‌లు వరికూటి శ్రీనివాసరావు, జె.బాగ్యమ్మ, తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి, వంగా సాంబిరెడ్డి, నాయకులు అడపా నారాయణరెడ్డి, దాసరి నరసరయ్య, దివ్వెల ఏడుకొండలు, దండా చిన్నా, కనక వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



కుంచవరంలో శంకుస్థాపన చేస్తున్న మంత్రి మనోహర్

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ ఎంపవర్మెంట్ శాఖ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన పరికరాల పంపిణీ జరిగింది. పొన్నూరు పట్టణ, మండలంలో 203 మందికి రూ.3,61,651/- విలువైన ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఉపకరణాలు పంచిపెట్టడం అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. వైసీపీ అసత్య ప్రచారాల పునాదులపై మనుగడ సాగిస్తుందని ఎద్దేవా చేశారు.



విభిన్న ప్రతిభావంతులకు వీల్ చైర్ అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర, జనసేన సమన్వయకర్త మార్కండేయబాబు

వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలలో అవినీతి జరిగిందని ఆరోపించారు. టీడీపీ హయాంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆదరణ పథకం ప్రవేశపెట్టి ఈ పథకం ద్వారా చేతివృత్తుల వారికి అవసరమైన నైపుణ్య పరికరాలను అందించేందుకు పరికరాలు తెప్పిస్తే వైసీపీ పాలకులు వాటిని కూడా అమ్మి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. ఈ పరికరాల మాయంపై కూడా విచారణ జరపనున్నట్లు తెలిపారు. సమావేశంలో మోదీ జన్మదినం సందర్భంగా కేకును కట్ చేసి దివ్యాంగులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గోవాడ వెంకటకృష్ణారావు, కూటమి పార్టీల నాయకులు, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వర్షపు నీటి నిల్వతో అంగన్వాడీ విద్యార్థుల ఇబ్బందులు

చేబ్రోలు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలో కురుస్తున్న వర్షాలకు ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు ఏర్పడి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. మండలంలోని శలపాడులోని రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద అంగన్వాడీ కేంద్రం చుట్టూ వర్షపు నీరు నిలిచాయి. దీంతో చిన్నారులు కేంద్రానికి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడినప్పుడల్లా ఇదే సమస్య ఏర్పడుతోంది. అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



వర్షపు నీటి మధ్య అంగన్వాడీ కేంద్రం



పాఠశాలను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ రాధిక

పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు

● మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక

తెనాలి అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మారీసుపేట మఠం బజారులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను బుధవారం పరిశీలించి కిటికీలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరా మెరుగుపరచాలని చెప్పారు. ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పట్టణంలో అన్ని పాఠశాలలను పరిశీలిస్తామని, ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కౌన్సిలర్ మహబూబ్ బాషా, డీఈ శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ

● జన్మదిన వేడుకల్లో నాయకులు

తెనాలి క్రైం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ దార్శనికత భారత్‌ను ప్రపంచ అగ్రదేశాలలో ఒకటిగా నిలుపుతుందని బీజేపీ పట్టణ సీనియర్ నాయకులు అడపా సంపత్‌రాయుడు పేర్కొన్నారు. బుధవారం మోదీ జన్మదిన వేడుకల సందర్భంగా తెనాలి రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో స్టేషన్‌లోని 13 మంది పారిశుధ్య కార్మికులను స్టేషన్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. వారికి గొడుగులు, చేతిగ్లౌజులు, మాస్కులు అందించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి గాజుల వెంకయ్యానాయుడు, సందీప్, దేవరాజ్, చైతన్య, బిట్ర కనకదుర్గ, మల్లపు రాజు, కనకదుర్గ, టి.రఘు, రవీంద్రబాబు, రత్నరాజు, సాయి, సాయిగుప్తా, కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ పేరిట పలు ఆలయాల్లో బుధవారం పూజలు చేయించారు. మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కొలకలూరు శివాలయంలో పూజలు చేశారు. రూరల్ మండల ఇన్‌చార్జి శివపార్వతి మాట్లాడుతూ, దేశం అన్ని రంగాల్లో ప్రధాని నాయకత్వంలో అభివృద్ధి పథంలో పురోగమిస్తుందని చెప్పారు. అమెరికా సైతం వేసిన పన్నులపై పునరాలోచించుకునే దిశగా ప్రధాని మోదీ వ్యూహం ఉందన్నారు. దేశంలో అన్ని వర్గాలు సంతోషంగా ఉండటంతో పాటు జీఎస్‌టి తగ్గింపుతో సామాన్య ప్రజలు పండుగ చేసుకుంటున్నారన్నారు. పార్టీ నాయకులు వాసుదేవనాయుడు, బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు, వీరయ్య, వెంకట్రావు, కృష్ణమోహన్, శిరీష, ఆషా పాల్గొన్నారు. సంగం జాగర్లమూడి, చావావారిపాలెం, నందివెలుగు ఆలయాల్లో పూజలు, అర్చనలు చేయించారు.

పొన్నూరులో..

పొన్నూరుటౌన్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గొప్ప ప్రజానాయకుడని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గోవాడ వెంకటకృష్ణారావు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినోత్సవాన్ని బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రస్వామి పుట్టవద్ద మోదీ పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని శ్రమదానం ద్వారా శుభ్రం చేశారు. ప్రధాని మోదీ దేశాభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కలపాల శ్రీనివాసరావు, చిలకపాటి రామాచార్యులు, ఆకాష్ గురుబాలు, మొగిలిపువ్వు సాంబశివరావు, కే సాంబశివరావు, గోవాడ శ్రీనివాసరావు, ఆరే వెంకట్రావు, గుడివాడ పవన్ చుక్క వెంకటేశ్వర్లు, సుశీల్రావు నరసింహారావు, సురేష్, తన్నీరు శివ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో..

చేబ్రోలు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు వడ్లమూడి క్వారీ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ మండల అధ్యక్షులు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షత వహించగా గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భజరంగ్ రామకృష్ణ, సీనియర్ నాయకులు కొత్తూరు వెంకటసుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి చెరుగుల్లి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పొన్నూరు: శ్రమదానంతో మొక్కలు తొలగిస్తున్న బీజేపీ నాయకులు



చేబ్రోలు: జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు



తెనాలి: కార్మికులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు



స్వస్థ నారి సశక్త్ పరివార్ వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం స్వస్థ నారి సశక్త్ పరివార్ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆరా తీశారు. అంగనవాడీ మహిళల ఆధ్వర్యంలో రూపొందించిన పౌష్టిక ఆహార స్టాలును ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని మోడీ జన్మదిన సందర్భంగా మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించటం హర్షిణీయమన్నారు. బుధవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు మహిళలకు వైద్య శిబిరాలు నిర్వహించి మహిళలకు అన్ని వ్యాధులకు వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇటీవలే గ్రామీణ ప్రాంతంలో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణం కోసం రూ.8 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో వైద్యులు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో వాగ్దానాల అమలు..

పొన్నూరుటౌన్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షలు నిర్వహించి స్వల్ప కాలంలోనే రికార్డు స్థాయిలో 16,000 మంది ఉపాధ్యాయుల నియామకం చేపట్టి వాగ్దానాల అమలులో చిత్తశుద్ధిని కూటమి ప్రభుత్వం నిరూపించుకుందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పొన్నూరు పట్టణంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను తొలిసారి ఎమ్మెల్యే అయన 1994లో తెలుగుదేశం ప్రభుత్వం డీఎస్సీ ద్వారా పెద్ద ఎత్తున ఉపాధ్యాయులను నియమించిందని గుర్తు చేశారు. తిరిగి ఇన్నేళ్ల తర్వాత పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు నియామకం చేపట్టడం కూటమి ప్రభుత్వ ఘనతగా చెప్పారు. ఈ డీఎస్సీ ద్వారా పొన్నూరు నియోజకవర్గంలో 40 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలను ఎంపికైనట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి త్వరలోనే పొన్నూరులో అభినందన సభ నిర్వహించనున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు దాదాపుగా అమలు చేసినట్లు వ్యవహరించారు. కానీ ప్రతిపక్ష వైసిపి పార్టీ దిక్కుతోచని స్థితిలో అసత్యాలను ప్రచారం చేస్తూ కాలం వెళ్ళదీస్తుందని ఎద్దేవ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే మొదటి హామీగా పెన్షన్ల పెంపు కార్యక్రమాన్ని అమలు చేశామన్నారు. అలాగే మమిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతు భరోసా, తల్లికి వందనం, ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అమలు చేశామని తాజాగా 16,000 మందిని డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా నియమించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పేదల విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తుందని నిరూపించిందని కొనియాడారు. ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి కూటమి ప్రభుత్వ అత్యధిక ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ వివరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

వీధి కుక్కల సమస్యకు పరిష్కారం చూపాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దిలీప్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అందే దిలీప్ కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జియావుల్ హక్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్ వినతిపత్రం అందజేశారు. ఇటీవల మండలంలోని వెల్లలూరు గ్రామంలో వీధి కుక్క దాడిలో చిన్నారి తాడిశెట్టి కార్తీక్ మృతి బాధాకరమన్నారు. ఇప్పటికైనా వీధి కుక్కల నియంత్రణకు సరైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. చిన్నారుల పాఠశాలల వంటి ప్రాంతాల వద్ద కుక్కల సంచారాన్ని నిరోధించాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయానికి కొబ్బరికాయలు కొట్టే స్టాండ్ బహూకరణ



స్టీల్ స్టాండ్‌ను అందజేస్తున్న భక్తులు

పెదకాకాని, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని గ్రామానికి చెందిన కొల్లి మల్లేశ్వర రావు, కనకదుర్గ భవాని దంపతులు రూ.50వేల విలువైన కొబ్బరికాయలు కొట్టే స్టీలు స్టాండ్‌ను రాహుకేతు మండపంలో వినియోగించుకునేందుకు బుధవారం దేవస్థాన ఉపకమిషనర్ గోగినేని లీలాకుమార్‌కు అందజేశారు.

వీధి కుక్కలు కరిచి బాలుడికి తీవ్రగాయాలు

చేబ్రోలు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలు వెంబడించి బాలుడిని కరవడంతో తీవ్రగాయాలైన ఘటన వడ్లమూడి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలుడు తండ్రి గోపీకృష్ణ పాలప్యాకెట్ తెచ్చేందుకు తన కుమారుడైన ధనుష్‌తో కలసి ఉదయం బయటకు వచ్చాడు. అక్కడున్న వీధికుక్కలు నాలుగు ఒకేసారి బాలుడుపై దాడిచేశాయి. ఈ ఘటనలో బాలుని శరీరంపై 15 చోట్ల గాయాలు కాగా స్థానికులు వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తెనాలి ప్రభుత్వవైద్యశాలకు తరలించారు.

అధిక పంట దిగుబడికి మిశ్రమ ఎరువులే మార్గం

చేబ్రోలు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగపురం, తోట్లపాలెం రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ప్రియదర్శిని మాట్లాడుతూ యూరియా వాడకం తగ్గించి రైతులు మిశ్రమ ఎరువులు వాడాలన్నారు. యూరియా వాడకం వలన చీడపీడలు ఎక్కువ అవుతాయన్నారు. ఈ పంట నమోదు గురించి రైతులకు వివరించారు. ప్రతి ల్యాండ్ పార్సిల్ ఈ పంటకింద నమోదు చేయించుకోవాలని కోరారు. యూరియా మీ చెంతకి కార్యక్రమంలో భాగంగా రైతులకు ఎరువులు అందించారు. ఆర్ఎస్‌కేలు, సొసైటీల ద్వారా ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నేతలు పాల్గొన్నారు.

మామపై అల్లుడు దాడి

తెనాలి క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భార్యను కాపురానికి పంపించడం లేదన్న ఆవేశంతో మామపై అల్లుడు దాడి చేసిన సంఘటన నందులపేటలో బుధవారం జరిగింది. టు టౌన్ పోలీసుల కథనం మేరకు నాదెళ్ల చక్రికి ఐదేళ్ల క్రితం నందులపేటకు చెందిన మందుగుల రవీంద్ర కుమార్తెతో వివాహం జరిగింది. వారికి ఒక కుమార్తె. ఏడాది క్రితం భార్యభర్తల మధ్య కలహాల నేపథ్యంలో భార్య పుట్టింటికి వచ్చింది. ఈ విషయమై మాట్లాడటానికి నందులపేటలోని మామ రవీంద్ర ఇంటికి వెళ్లిన చక్రికి భార్య కనిపించకపోవడంతో అక్కడే ఉన్న మామపై దాడి చేశాడు. రవీంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.